J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 18.09.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 16 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerpatrika.com

## సామాజిక మాధ్యమాల వేదికగా...

# హద్దు దాటుతున్న రాజకీయ యుద్ధం

- రెచ్చిపోతున్న సామాజిక సైన్యం
- ముదురుతున్న పోస్టింగ్‌ల పైత్యం



సమాచార వేదికగా మారిన సోషల్ మీడియాలో రాజకీయ పార్టీలు, వారి అనుయాయులు చేస్తున్న విమర్శలు, పెడుతున్న పోస్టింగులు శృతిమించిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్కృతి పేట్రేగిపోతోంది. సామాజిక మాధ్యమాలకు సెన్సార్ లేదు, ఎడిటింగ్ ఉండదు, విషయం బయటకు వచ్చిన తరువాత నియంత్రించడం ఒక్కటే పరిష్కారం. మనసులో ఏర్పడ్డ భావాలను, అభిప్రాయాలను నిర్భయంగా చెప్పగలిగే ఒకే ఒక వేదిక సామాజిక మాధ్యమం. అయితే ఇప్పుడు అంతర్జాతీయంగా ఈ సామాజిక సైన్యం విజృంభిస్తోంది. వ్యంగ్యాస్త్రాలతో, నిరాధార నిందలతో, బూతుపురాణాలతో రెచ్చిపోతోంది.

(మిగతా 10వ పేజీలో)

## తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ కన్నుమూత



పేద ప్రజల ఆత్మబంధువు, అజాతశత్రువు, తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు ఈ నెల 16న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉంటూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. ప్రజలందరి సమస్యలు వింటూ వారి సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తూ తన మంచితనంతో అందరికీ చేరువై మంచి నాయకునిగా తన రాజకీయప్రస్థానం సాగించిన ఆయన పరమపదించడం జిల్లా ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. గూడూరు ఎమ్మెల్యేగా, రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా, తిరుపతి ఎంపీగా ప్రజలకు ఆయన ఎనలేని సేవలందించారు.

(మిగతా 10వ పేజీలో)

## 'స్టే'లతో కలకలం

10లో

## పార్టీల్లో కలవరం







# కళ్ళాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

## వడ్లు కొనండి బాబో... - ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్న రైతన్నలు

**జిల్లా రైతాంగాన్ని దురదృష్టం వీడి పోవడం లేదు. కష్టపడి పంటలు పండించుకోవడమే ఈ కరోనా కష్టకాలంలో కనాకష్టమైతే పంట చేతికి వచ్చి కోతలు పూర్తయి రేపోమాపో అమ్మకం జరిగి పోతుందనుకున్న దశలో వరుణుడు కూడా కరుణించకపోవడంతో గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో కళ్ళాల్లో ఆరబెట్టు కుంటున్న పంటంతా తడిసిపోయి రైతులు నానా యాతనలు పడుతున్నారు. ఒకవైపు గిట్టుబాటు ధర లేక, మరోవైపు ధాన్యం తడిసిపోతుండడంతో ఏమీ చేయలేక నిస్సహాయస్థితిలో కంటతడిపెడుతున్నారు.**

- ➔ **ఆరబెట్టుకుంటున్న పంటంతా వర్షం పాలు**
- ➔ **ఎప్పటికి తీరుతాయో అన్నదాతల కష్టాలు!**



వరికి పుట్టినిల్లయిన నెల్లూరుజిల్లాలో రైతుల కష్టాలు చెప్ప లేనన్ని. చెప్పుకుంటూ పోతే కొండవీటి చాంతాడంత. ఆరుగాలం కష్టపడి శ్రమించి, అప్పోసప్పో చేసుకుని పంటలు పండించు కోవడం ఒక ఎత్తయితే, వాటిని అమ్ముకునేలోగా రైతులు పడే కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ప్రతిఏడాదీ ఇలాంటి కష్టాలతోనే రైతు చితికిపోతున్నాడు. ఈసారి సాగునీటికి ఢోకా లేకపోవడం, పంటలు బాగా పండడంతో రైతులు సంతోషించారు. చేసుకున్న అప్పులు తీరిపోయి తమ కుటుంబాలు గట్టున పడతాయని ఆశించారు. అయితే, వారి ఆశలన్నీ అడియాసలే అవుతున్నాయి.

### గిట్టుబాటు ధర లేక నష్టాలు :

ధాన్యానికి గిట్టుబాటు ధర ఇస్తామని ప్రభుత్వం పదేపదే చెప్తున్నా, పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లడం అంత సులభం కాదు. ఎక్కడో పల్లెటూళ్లలో ఎంతో దూరాన పొలాల్లో పండిన ధాన్యాన్ని అక్కడి నుంచి రోడ్ల మీదకి తీసుకువచ్చి, కొనుగోలు కేంద్రాల దాకా తీసుకువెళ్లాలంటే ఈ కరోనా కష్టకాలంలో కూలీలు అందుబాటులో లేక, రవాణా సౌకర్యాలు సక్రమంగా లేక రైతులు పడే బాధలు ఆ దేవునికే ఎరుక. తీరా వాటిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు సిద్ధమైనా మిల్లర్లో, దళారులో మాయచేసి మధ్యలోనే ఆ ధాన్యాన్ని అత్యంత తక్కువ ధరకే ఎగరేసుకుపోతున్నారు. మిల్లర్ల ప్రమేయం లేకుండా రైతుల నుంచి నేరుగా ప్రభుత్వమే కళ్ళాలకాడికొచ్చి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తే తప్ప రైతన్నలకు ఈ కష్టాలు తీరవు. కానీ ఆచరణలో అవన్నీ ఎప్పటికి జరుగుతాయో అధికారులకే ఎరుక. ఈలోగా వానలు ముంచుకొచ్చి ఆరబెట్టు కుంటున్న ధాన్యాన్ని కాస్తా తడిపేస్తుండడంతో, తడిసిన ధాన్యం నాణ్యత తగ్గిపోవడంతో ధర కూడా తగ్గిపోతుందని ఎవరు ముందొస్తే వాళ్ళకే రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకే తెగనమ్మేసుకుంటున్నారు.

### 'తడిసి' మోపెడవుతున్న కష్టాలు :

ఈ నష్టాలు చాలవన్నట్లు మధ్యలో ముంచుకొస్తున్న వానలొకటి. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడా కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను ముంచివేయడమే కాక, పండిన ధాన్యాన్ని కళ్ళాల్లోనే తడిపేస్తుండడంతో రైతులు బిక్కచచ్చిపోతున్నారు. ఎంతగా పట్టలు పరచి వాటిని భద్రపరుచుకుందామన్నా రెండు మూడు రోజులుగా అదేపనిగా వాన జల్లులు పడుతూ ఉండడంతో వాన నీరు భూమిలోకి ఇంకిపోయి ధాన్యం గింజలు నానిపోతున్నాయి. నానిన గింజలు మొలకలెత్తుతుండడంతో ఆ ధాన్యాన్ని ఎలా అమ్ముకోవాలో తెలియక రైతులు దిగాలు పడుతున్నారు. మారుమూల పల్లెల్లో, దూరప్రాంతాల్లో ఉన్న కళ్ళాల్లో ధాన్యం, మరోవైపు రోడ్లమీద ఆరబెట్టుకుంటున్న రైతుల ధాన్యం అన్నీ ఇలా వానపాలు కావడం ఎంతో బాధాకరం. తడిసిన ధాన్యంలో విరుగుడు వస్తుందని, నాణ్యత లేదని, వీటిని కొంటే తమకే నష్టం వస్తుందని మాయమాటలు చెప్తూ దళారులు ఇదే సందని తక్కువ ధరకే రైతుల నుంచి ధాన్యం కొనేస్తున్నారు. పండిన ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు అవసరమైన గోదాములు అందుబాటులో లేకపోవడంతో ఎంతోకాలంగా జిల్లా రైతులు ఇలా బాధలు పడుతూనే ఉన్నారు. గ్రామాల్లో పెద్దఎత్తున ధాన్యం గోదాముల నిర్మాణం జరిగితే తప్ప ఈ సమస్య ఒక కొలిక్కి రాదని రైతులు చెప్తున్నారు. అయితే, ధాన్యం ఏ రకంగా ఉన్నా పరవాలేదని, ప్రభుత్వం కొంటుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెప్తున్నా..అవన్నీ ఆచరణలోకి రావడం అంత సులభం కాదు. రైతులు కొనుగోలు కేంద్రాలకు వచ్చే దాకా తడిసిపోకుండా ఉండాలి కదా?.. ఈ లోగా వానలకు ధాన్యం ఎక్కడ నీట మునిగిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు రైతులు. సరిగ్గా ఈ దశలో మిల్లర్లు, దళారులు ఇదే అదనుగా రైతుల వద్దకు నేరుగా వెళ్ళి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనేస్తున్నారు. దీంతో మళ్ళీ రైతుల పరిస్థితి యధాతథంగానే ఉంటోంది.

ప్రభుత్వాలు ఈ కష్టాలన్నీ నిశితంగా పరిశీలించి, రైతులతో నేరుగా సంప్రదింపులు జరిపి, వారి కష్టాలను వారిద్వారానే విని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి. అందరికీ అన్నం పెట్టే అన్నదాతల జీవనప్రమాణాలు మెరుగుపరిచేందుకు, వారి కష్టాలు తీర్చేందుకు చిత్తశుద్ధితో పటిష్టమైన ప్రణాళికలను రూపొందించి అమలుచేయాలని జిల్లా రైతాంగం ముక్తకంఠంతో ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటోంది.

## బల్లి దుర్గాప్రసాద్ మృతికి
# ప్రముఖుల సంతాపం

**సుమారు నాలుగు దశాబ్దాల పాటు రాజకీయరంగంలో ఉంటూ ప్రజలకు ఎనలేని సేవలందించిన తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ జిల్లా నుంచి జాతీయస్థాయి దాకా ఎందరో నాయకులు, ప్రముఖులు తమ సంతాపం ప్రకటించారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు.**

తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు మృతికి భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విచారం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం కోసం ఆయన నిరంతరం పనిచేశారని, ఆయన కుటుంబానికి రాష్ట్రపతి తన సంతాపం తెలియజేస్తూ ట్వీట్ చేశారు. అదేవిధంగా భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన సంతాప సందేశంలో '28 ఏళ్ళ వయసులోనే రాజకీయాల్లో ప్రవేశించిన బల్లి దుర్గాప్రసాద్‌గారు అనేక ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని, పార్లమెంటేరియన్‌గా, నాలుగు పర్యాయాలు గూడూరు శాసనసభ్యులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమైనవని' కొనియాడారు. బల్లి దుర్గాప్రసాద్‌రావు ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రధాని నరేంద్రమోడీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తమ సంతాప ప్రకటనల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి దుర్గాప్రసాద్‌రావు మృతికి తమ సంతాపం తెలియజేశారు.

### సిఎం జగన్ దిగ్భ్రాంతి

బల్లి దుర్గాప్రసాద్‌రావు మృతిచెందారన్న సమాచారం తెలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుమారుడు కళ్యాణ్‌కు సిఎం ఫోన్‌చేసి ఓదార్చారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని అంటూ విచారం వ్యక్తం చేశారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలు బల్లి దుర్గాప్రసాద్‌రావు మృతికి విచారం వ్యక్తం చేశారు.

### బల్లి దుర్గాప్రసాద్ సేవలు అమూల్యం - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బల్లి దుర్గాప్రసాద్‌రావు అకాలమృతి ఎంతో బాధాకరమని, ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఆయన ప్రజలకెంతో సేవచేసిన నాయకుడని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

### శ్రీసిటీతో అనుబంధం మరువలేనిది - ఎం.డి రవీంద్రసన్నారెడ్డి

బల్లి దుర్గాప్రసాద్ మరణం తననెంతగానో ఆవేదనకు గురిచేసిందని, శ్రీసిటీతో ఆయనకున్న అనుబంధం మరచిపోలేనిదని శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

### దుర్గాప్రసాద్‌రావు మృతి బాధాకరం - మాజీమంత్రి సోమిరెడ్డి

బల్లి దుర్గాప్రసాద్‌రావు హఠాన్మరణం తనకెంతో బాధ కలిగిస్తోందని, తెలుగుదేశం పార్టీలో తామిద్దరం ఎంతోకాలం కలసి పనిచేశామని, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా టిడిపి హయాంలో ఆయనకు అవకాశం కలిగిందని మాజీ మంత్రి, టిడిపి నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మృతికి విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబసభ్యులకు తన సంతాపం ప్రకటించారు.

## కాలధర్మం

### కె.వి.ప్రభాకరరెడ్డి



నెల్లూరు వాస్తవ్యుడు, ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్, కోడూరు వెంకట ప్రభాకరరెడ్డి, ఈ నెల 12వ తేదీ శనివారం, తన 69వ యేట నెల్లూరులో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచాడు. ఆయనకు భార్య, కుమారుడు వున్నారు. కొడవలూరు మండలం, బొడ్డువారిపాలెం ఆయన స్వగ్రామం. రైతు కుటుంబంలో జన్మించి, పియుసి వరకు చదువుకున్నాడు. స్వంతంగా రైస్ మిల్లుని ప్రారంభించి వ్యాపారవేత్తగా తన ప్రస్థానం మొదలుపెట్టాడు, అనంతరం రైల్వే కాంట్రాక్టులవైపు మొగ్గు చూపాడు. కెజెకె ఇన్‌ఫ్రాటెక్ ప్రయివేట్ లిమిటెడ్ పేరుతో సంస్థను ప్రారంభించి, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా అంచెలంచెలుగా ఎదిగాడు. దక్షిణ రైల్వే, సౌత్ వెస్టన్ రైల్వేలతో పాటు తూర్పు తీర(ఈస్ట్ కోస్ట్) రైల్వే శాఖలలో నైపుణ్యత కలిగిన కాంట్రాక్టర్‌గా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. సమర్థత కలిగిన పనితీరుతో, అంకితభావం, క్రమశిక్షణతో పాటు, ముఖ్యంగా సమయపాలనతో ఇచ్చిన పనిని చెప్పిన టైం కంటే ముందే పూర్తిచేయకలిగే సత్తా ఉన్న సంస్థగా తన సంస్థకు గుర్తింపు తెచ్చుకున్నాడు.

తమిళనాడులో అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను నిర్దేశించిన సమయంలో పూర్తిచేసి రైల్వే శాఖ అభినందనలతోపాటు తమిళనాడు ప్రభుత్వ ప్రశంసలనుకూడా ప్రభాకర్‌రెడ్డి అందుకున్నాడు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ క్రింద అనేక దాన ధర్మాలను చేసినా ఎక్కడా తన పేరు చెప్పుకునేవాడు కాదు. ప్రభాకరరెడ్డి కుమారుడు మురళీధర్‌రెడ్డి తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని కాంట్రాక్టర్‌గా ఎదుగుతున్నాడు. ఇంటి పెద్దను కోల్పోయి దుఃఖసాగరంలో వున్న ప్రభాకరరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## పల్లిపాడు.. పినాకిని గాంధీ ఆశ్రమంలో..
# పొణకా కనకమ్మకు ఘన నివాళి

దేశంలోనే ఎంతో ప్రసిద్ధిచెందిన ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని గాంధీ ఆశ్రమంలో ఈనెల 15న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, ఆశ్రమ నిర్మాణకర్త పొణకా కనకమ్మ వర్థంతిని పురస్కరించుకుని ఆమె సేవలకు ఘననివాళు లర్పించారు. ఆశ్రమం కన్వీనర్ గణేశం కల్పనమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలో ఉన్న పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ ఆశ్రమం నిర్మాణానికి 13 ఎకరాల భూమిని ఇచ్చిన దాత పొణకా కనకమ్మ అని, ఆమె జీవితం ఆదర్శప్రాయమని, భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ప్రచార సమన్వయకర్త రొంపిచర్ల శివరామయ్య, సభ్యులు మంజుల, మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వీడియో పాఠాలు

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు సప్తగిరి ఛానల్‌లో రోజుకు 6 గంటల పాటు ప్రసారమవుతున్న వీడియో పాఠాలను విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ పాఠాలు ప్రసారమవుతాయని, విద్యార్థులు ఈ వీడియో పాఠాలను సద్వినియోగం చేసుకునేలా ఉప విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# న్యాయవ్యవస్థే దాడికి దిగడం అసాధారణం

## న్యాయవ్యవస్థ తీరును రాజ్యసభలో ప్రస్తావించిన విజయసాయిరెడ్డి



నిష్పాక్షికతను విస్మరిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవ్యవస్థ అసాధారణ రీతిలో ప్రభుత్వంపైన, మీడియా, సోషల్ మీడియా, పత్రికా స్వేచ్ఛ, వాక్‌స్వాతంత్రంపై చేసిన దాడి గురించి గురువారం వైఎస్సార్సీపీ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి రాజ్యసభలో ప్రస్తావించాడు. అమరావతి భూముల కుంభకోణానికి సంబంధించిన కేసు విషయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వెల్లడించిన తాత్కాలిక ఆదేశాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించాడు. అమరావతి భూముల కుంభకోణంలో మాజీ అడ్వకేట్ జనరల్ ఇతరులపై సీఐడీ నమోదు చేసిన కేసును విచారిస్తూ, ఎఫ్ఐఆర్ వివరాలకు సంబంధించి ఎలాంటి వార్తలు, సమాచారం మీడియా, సోషల్ మీడియాలో ప్రచురణ కాకుండా నిషేధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మీడియాను ఎందుకు సెన్సార్ చేయాలో పేర్కొంటూ పిటిషనర్ ఎలాంటి రుజువులు, ఆధారాలు చూపకుండా కేవలం పిటిషనర్ ఆరోపణల ఆధారంగా కోర్టు మీడియాపై సెన్సార్‌షిప్ విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. పైగా సీఐడీ నమోదు చేసిన కేసులో విచారణను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు అసాధారణంగాను, అత్యంత సందేహాస్పదంగా ఉన్నాయి అంటూ... న్యాయపరంగా ఈ ఉత్తర్వులు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని ఆయన అన్నాడు. పిటిషనర్ ఆరోపించినట్లుగా ప్రభుత్వం తమని వేధిస్తున్నట్లయితే అటువంటి అంశాలకు విస్తృత మీడియా ప్రచారంద్వారా పిటిషనర్‌కు మేలు జరుగుతుందికదా..? కానీ ఈ కేసులో మీడియాపై ఆంక్షలు విధించాలని పిటిషనర్ కోరడం, కోర్టు ఆమేరకు ఆదేశాలు జారీ చేయడం వంటి చర్యలు సందేహాస్పదంగా ఉన్నాయని సాయిరెడ్డి అన్నాడు. మీడియా స్వేచ్ఛను ప్రభుత్వాలు హరించడం సర్వసాధారణంగా జరిగే విషయం. కానీ ఆంధ్రప్రదేశ్‌లో దీనికి భిన్నంగా అసాధారణ రీతిలో న్యాయవ్యవస్థ మీడియాపై ఆంక్షలు విధించడం విడ్డూరంగాను, రాజ్యంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవ్యవస్థ నిష్పాక్షింగా వ్యవహరించడం లేదని, ఒకవైపు ఆర్థిక సమస్యలతో సతమతమవుతూనే మరోవైపు న్యాయవ్యవస్థ నుంచి ఎదురవుతున్న దాడులను తట్టుకుంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరోనాపై విజయవంతంగా పోరాటాన్ని కొనసాగిస్తోందని విజయసాయి అన్నాడు.

గత ప్రభుత్వం చేసిన అక్రమాలు, తప్పులను కప్పిపుచ్చడానికే న్యాయవ్యవస్థ ఇలా వ్యవహరిస్తుందనే భావన ప్రజల్లో బలంగా ప్రబలిపోయిందని విజయసాయిరెడ్డి అన్నాడు.

# 'పబ్లిక్ డిమాండ్'కి ప్రభుత్వ స్పందన

పబ్లిక్ పక్షాణ నిలబడి "పబ్లిక్ డిమాండ్" పేరుతో 'లాయర్' పత్రికలో సంచారి చేస్తున్న డిమాండ్‌లకి విశేష ఆదరణ లభిస్తోంది. సెప్టెంబర్ 4వతేదీ సంచికలో "ప్రగల్భాలు మాని పనితనం చూపండి" అని చేసిన డిమాండ్‌లో, అన్ని కరోనా ఆసుపత్రులకు ఒక్కొక్కరి చొప్పున నోడల్ అధికారులను నియమించి ఆసుపత్రి యాజమన్యాల నిర్లక్ష్యాన్ని, నిలువు దోపిడీని నియంత్రించవచ్చుకదా అని సంచారి ప్రశ్నించాడు.

ప్రభుత్వం స్పందించింది... నగరంలోని అన్ని ఆసుపత్రులతోపాటు కావలి, ఆత్మకూరు ఆసుపత్రులలో నోడల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడమే కాకుండా ప్రజల సౌకర్యం కోసం వారి పేర్లు, వివరాలు ఫోన్ నంబర్లను కూడా విడుదల చేసింది... ఆ వివరాలు...

| ఆసుపత్రి పేరు | నోడల్ అధికారి | ఫోన్ నెంబర్ |
|---|---|---|
| జీజీహెచ్ | నాగేశ్వరరావు | 9493865065 |
| నారాయణ | నవ్య(నుడా వీసీ) | 9848568724 |
| మెడికవర్ | రమేష్ | 9063188888 |
| అపోలో | మధుసూధన్‌రావు | 6300644144 |
| డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ | నాగలక్ష్మి | 7702953555 |
| రెయిన్‌బో | పద్మనాభయ్య | 9030470929 |
| లోటస్ | సువర్ణమ్మ | 8985501725 |
| జయభారత్ | సూర్యప్రకాష్ | 7799439688 |
| రిచ్ | వేణుగోపాల్‌రావు | 9100121759 |
| ఏరియా ఆసుపత్రి (కావలి) | సుబ్బారావు | 9949911737 |
| జిల్లా ఆసుపత్రి (ఆత్మకూరు) | ఉమాశంకర్ | 9440904149 |

అదేవిధంగా అరపూట లాక్‌డౌన్ కూడా ఎత్తివేయాలంటూ సంచారి ప్రజల పక్షాన డిమాండ్ చేశాడు. సెప్టెంబర్ 10వతేదీ ఆ వార్త రాసే సమయానికి సాయంత్రం 4గంటల వరకూ లాక్‌డౌన్‌కి సడలింపు ఇచ్చిన ప్రభుత్వం, ఈ గురువారం 17వతేదీ నుండి రాత్రి 8గంటల వరకు దుకాణాలకు, ప్రజల రాకపోకలకు అనుమతినిచ్చింది. మొత్తానికి సంచారి చేసిన రెండు డిమాండ్లూ నెరవేర్చినందుకు అధికారులకు ధన్యవాదాలు.

# కొత్త నేతలొచ్చినా.. పాత పాటే పాడుతున్నారే..?

పబ్లిక్ డిమాండ్

## ○ కలవని తూర్పు - పడమరలను ఆర్‌ఓబిలతో కలిపే ప్రయత్నం చెయ్యండి

**నెల్లూరు నగర జనాభా దాదాపు 7లక్షలు దాటింది. నగరం నిత్యం నలు వైపులా విస్తరిస్తూనే వుంది. పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా నిర్మాణాలూ పెరుగుతున్నాయి. మారుతున్న కాలంతో పాటు జనజీవన విధానం కూడా మారింది, కాలంతోపాటు వాళ్ళూ మారారు, కానీ మన నేతల ఆలోచనా విధానాలు మాత్రం మారడంలేదు.**

ప్రభుత్వాలు మారుతున్నాయి, పార్టీలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు, పాతతరం పోయి కొత్తతరం తెరపైకి వచ్చింది కానీ తమ ఆలోచనలలో మాత్రం ఈ తరం కొత్తదనాన్ని చూపించలేకపోతోంది.

గడచిన 30 సంవత్సరాల కాలంలో నెల్లూరుపట్టణం ఊహించనంతగా పెరిగిపోయింది, కొత్త లేఔట్లతో కొత్త కాలనీలు పుట్టుకొచ్చాయి, గ్రామీణ ప్రాంతాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలనుండి కూడా వేలాదిమంది తరలివచ్చి నెల్లూరులో స్థిరపడుతున్నారు. ఒకప్పుడు మునిసిలిపాలిటీగా ఉన్న నగరం, దివంగత మహా నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అని 2004 అక్టోబరులో కార్పొరేషన్‌గా మారింది. ఊహించని రీతిలో అభివృద్ధి చెందిన నగరంలో ప్రజలను బాగా ఇబ్బంది పెడుతున్న సమస్య తూర్పు పడమరల మధ్య రాకపోకలు. వర్షం వస్తే అటు, ఇటు నివసిస్తున్న వాళ్ళు రెండుప్రాంతాల ప్రజలుగా విడిపోవాల్సిందే.





తూర్పుని, పడమరని చీలుస్తూ నగర నడిబొడ్డులో రైల్వేలైను వుంది. ఈ రైల్వే లైనుని దాటేందుకు నగరంలో ఎక్కడా ఒక్క ఆర్‌ఓబి(రైల్ ఓవర్ బ్రిడ్జి) కూడా లేదు. మొదటగా ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో ఒక ఆర్‌యుబి(రైల్ అండర్ బ్రిడ్జి)ని బ్రిటిష్ కాలంలో నిర్మించారు. ఆ తరువాత చాలా సంవత్సరాలు విజయ మహల్ గేటు, ముత్తుకూరు గేటు, కొండాయపాలెం, భక్తవత్సలనగర్ గేట్ల మీదుగానే రాకపోకలు సాగాయి. 1970 దశకంలో ఆనం వెంకటరెడ్డి మంత్రిగా వున్న కాలంలో ఆయన చొరవతో ముత్తుకూరు గేటు ప్రాంతంలో విఆర్‌సి సెంటర్, రామలింగాపురంలను కలుపుతూ మరో రైల్వే అండర్‌బ్రిడ్జి వచ్చింది. మళ్ళీ 15 సంవత్సరాలకు మాగుంట సుబ్బరామిరెడ్డి రూపుదిద్దిన మాగుంట లే అవుట్ పుణ్యమా అని ఆయన పర్యవేక్షణలో 1995లో ఇంకొక అండర్ బ్రిడ్జి సరస్వతినగర్ నుండి కొండాయపాళెం రోడ్డును కలుపుతూ ఏర్పడింది. ఇప్పుడది మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డుగా ప్రసిద్ధి చెందింది. కొన్నేళ్ళకు 2003వ సంవత్సరంలో తాళ్ళపాక అనురాధ మునిసిపల్ ఛైర్‌పర్సన్‌గా వున్నప్పుడు కమ్యూనిస్టు సోదరుల ఉద్యమం ఫలితంగా విజయమహల్ గేట్ ప్రాంతంలో బాక్స్ టైప్ బ్రిడ్జి ప్రారంభమయ్యింది.

భారత ఉపరాష్ట్రపతి మన వెంకయ్య నాయుడు సభలలో మాట్లాడుతూ తరచూ ఒక మాటంటూ ఉండేవాడు "నెల్లూర్లో మంచి వానొస్తే అటోళ్లు అటు, ఇటోళ్లు ఇటు ఉండాల్సిందే, వీళ్ళు అటు పోవాలన్నా, వాళ్ళు ఇటు రావాలన్నా పడవలు కావాలి" అనే మాట ఆయన అనేక సందర్భాలలో ప్రస్తావించాడు, కానీ ఎందుకనో ఆయన కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కూడా ఈ రెండుదిక్కులను ఆర్‌ఓబిల ద్వారా కలిపే ప్రయత్నం జరగలేదు. ప్రస్తుతానికి అయ్యప్ప గుడి వద్దనుండి వచ్చే ఒక్క మినీ బైపాస్‌లో తప్ప ఇంకెక్కడా రైల్ ఓవర్ బ్రిడ్జిలు లేవు. 1997-99ల మధ్య కాలంలో మినీబైపాస్ వచ్చింది. ఎప్పుడు భారీవర్షాలు వచ్చినా ఈ అండర్ బ్రిడ్జిలు నిండిపోవడంతో... విజయమహల్ గేటు, కొండాయపాలెం రోడ్డులో వున్న రెండవ గేటు, భక్తవత్సలనగర్‌లో వున్న లో-లెవెల్ గేట్లే నగరవాసులకు దిక్కుగా మారుతున్నాయి. ఎప్పుడు భారీ వర్షాలు కురిసినా ఈ గేట్ల వద్ద గంటలకొద్దీ ట్రాఫిక్ ఆగిపోవడం, నగరవాసులు నేతలను చీవాట్లు పెట్టుకోవడం పరిపాటైపోయింది.

ఆత్మకూరుబస్టాండు కూడలిలో రైల్ ఓవర్ బ్రిడ్జి సాధ్యం కాకపోవడంతో అక్కడ ట్రాఫిక్‌ని అదుపుచేయడానికి అప్పట్లో రమేష్‌రెడ్డి మినీబైపాస్‌లో ఫ్లై ఓవర్ ప్రతిపాదించి నిర్మింపచేశాడు. ఇప్పుడు రామలింగాపురం వద్ద కూడా పరిస్థితి అదే. ఇక్కడ కూడా రైల్వే ఓవర్ బ్రిడ్జి సాధ్యం కాదు, ఇప్పటికే అండర్ బ్రిడ్జిలు ఉన్న ప్రాంతంలో ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడానికి రైల్వే శాఖ అనుమతించదు కాబట్టే ఇక్కడ కూడా ట్రాఫిక్‌ని అదుపుచేయాలంటే మళ్ళీ మినీబైపాస్‌లో మరో ఫ్లైఓవర్ నిర్మించాల్సిందే. ఆ పనికే ఇప్పుడు మంత్రి అనిల్ శ్రీకారం చుట్టాడు. సుమారు 50కోట్ల రూపాయలతో ఇక్కడ ఫ్లై-ఓవర్ నిర్మించనున్నారు. ఈ ఫ్లై-ఓవర్ పూర్తయితే ఇక్కడ ట్రాఫిక్‌కి శాశ్వత పరిష్కారం లభించినట్లే.

ఇప్పుడు ఆలోచించాల్సింది వానాకాల సమస్య, అంతేకాదు ఇంతగా అభివృద్ధి చెందిన నగరంలో 2020వ సంవత్సరంలో కూడా నగరవాసులు రైల్వేగేట్లపైన ఆధారపడి ఉండడం సిగ్గుచేటైన విషయం. పాత పాలకులు పాడిన పాటే కొత్త నేతలు కూడా పాడకుండా రైలు కట్ట దాటడానికి ఓవర్ బ్రిడ్జిలు నిర్మించే ఆలోచన చెయ్యాలి. గతంలో అధికారులు ప్రతిపాదించినట్లుగా కొండాయపాళెం, భక్తవత్సలనగర్ గేట్ల ప్రాంతంతో పాటు మద్రాసు బస్టాండు సమీపంలోని జూబిలీ ఆసుపత్రి రోడ్డును పడమరవైపు నగరంతో అనుసంధానం చేసే కొత్త రోడ్డు ప్రతిపాదనను కూడా పరిగణనలోకి తీసుకుని వీటి సాధనపై దృష్టి పెడితే నగరంలో ట్రాఫిక్ సమస్యకు కొంత పరిష్కారం లభించడంతోపాటు రైలు పట్టాలకు ఇరువైపులా నివసించే నగర ప్రజల వానాకాల కష్టాలతోపాటు రైలు గేట్ల కష్టాలు కూడా తీరిపోతాయి.

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com
Please note the change

# 'ప్రభా'తం

ప్రపంచాన్నే గడగడ వణికిస్తూ, అన్ని దేశాల ఆర్థిక స్థితిగతుల్ని అతలాకుతలం చేస్తూ కరోనా నానాటికీ మరింత విజృంభిస్తూనే ఉంది. ఎన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నా ప్రపంచంలో రోజురోజుకీ కరోనా కేసుల సంఖ్య పెరగడమే కానీ, తగ్గడం లేదు. ఇప్పటికే కరోనా బాధితుల సంఖ్య దాదాపు మూడు కోట్ల దాకా చేరుకుంటున్నదంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో తేటతెల్లమవుతోంది. ఈ నేపథ్యంలో అన్ని దేశాల్లో ప్రజల జీవన పరిస్థితులు కోలుకోలేనంతగా దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా మనదేశంలో కోట్లాది మంది బడుగుజీవుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. రోజువారీ కూలీపై ఆధారపడి జీవనం సాగించే నిరుపేదల కష్టాలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. బయటకు వెళ్ళాలంటే కరోనా ఎక్కడ కాటువేస్తుందోనని భయం. ఇళ్ళల్లో ఉండాలంటే పొట్టగడవదు. పనులు చేసుకుంటే తప్ప కుటుంబాలు సాగవు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంతో కొంత బడుగుజీవులను ఆదుకునే ఉపాధి హామీ పథకం కూడా ఆశించిన స్థాయిలో అమలులోకి రాకపోవడమే బాధాకరం. ఇటీవల గత కొద్ది నెలలుగా అక్కడక్కడా కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో కష్టజీవులకు కొద్దిపాటి పనులు లభించినా పూర్తిస్థాయిలో దేశంలో పేదలకు ఉపాధి కల్పన జరగకపోవడం విచారకరం.

దేశంలోని కోట్లాదిమంది బడుగు బలహీనవర్గాల వారికి, రెక్కాడితే గానీ డొక్కాడని కష్టజీవులకు ఉపాధి కల్పించేందుకు జాతిపిత మహాత్మాగాంధీ పేరుతో అమలవుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం నానాటికీ నిధుల్లేక నీరసపడిపోతున్న మాట నిష్ఠురసత్యం. అవసరమైన నిధులు లేకపోవడం, పనులు కరువవడం వల్ల ఎంతోమంది పేదలు ఉపాధి కరవై అల్లాడిపోతున్నారు. ఈ మాయదారి కరోనా వల్ల అటు గ్రామాల్లోనూ, కరోనాతోపాటు నిరుద్యోగ రాకాసి కూడా చేరి.. ఇటు పట్టణాల్లోనూ ఉపాధి అవకాశాలు బాగా కుంటుపడిపోయాయి. మనదేశంలో అటు వ్యవసాయ రంగంలోనూ, ఇటు పరిశ్రమల రంగంలోనూ దాదాపు 80శాతం మంది దాకా కార్మికులు, కష్టజీవులు ఉపాధిని పొందుతున్న నేపథ్యంలో కరోనా మహమ్మారి ఆ రెండు రంగాలను మరింతగా అతలాకుతలం చేస్తోంది. దేశంలో వ్యాపారాలు, ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోవడంతో కోట్లాదిమంది కార్మికులు, వలసజీవులు, చివరికి ఎంతోమంది విద్యావంతులు సైతం జీవనోపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో అల్లాడిపోతున్నారు.

దేశంలోని గ్రామీణ పేదలను ఈ కష్టకాలంలో ఆదుకోవాలని, వారికి ఉపాధి కల్పించాలనే సదాశయంతో ప్రధాని మోడీ వేలాదికోట్ల రూపాయలు కేటాయిస్తూనే ఉన్నారు కానీ..ఇంకా ఈ పథకానికి నిధుల కొరత ఉండడంతో ఉపాధి హామీ రథం ఆశించిన స్థాయిలో సాఫీగా ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఎన్నో గ్రామాల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధులు ఇప్పటికే ఆవిరైపోవడంతో పనులు కరువై, కుటుంబాలను పోషించుకోలేక శ్రమజీవులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

ఎంతోమంది కార్మికులు కరోనా దెబ్బతో ఇప్పటికే సొంత ఊళ్ళకు వెళ్ళిపోయారు. అయితే అక్కడ కూడా జీవనోపాధి దొరక్క అర్ధాకలితో అలమటిస్తున్నారు. గతంలో ఉపాధి పనులు చేసిన వేలాదిమంది కూలీలకు ఇవ్వాల్సిన డబ్బులు కూడా అనేక ప్రాంతాల్లో ఇవ్వలేకపోవడంతో మొత్తంగా దేశంలో ఆ బకాయిలు వేలకోట్లకు చేరుకుంటున్నాయంటే ఈ పథకం పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఊహించుకోవచ్చు. దేశంలో ఏటా కోట్లాదిమందికి జీవనోపాధి కల్పించే ఈ పథకానికి పూర్తిస్థాయిలో ఆర్థికపరిపుష్టిని కల్పించాల్సి ఉంది. అంతేకాదు కరోనా భయంతో కష్టజీవులు, పేదలు బయటప్రాంతాలకు వెళ్లలేరు కనుక ఏ ప్రాంతంలో ఉన్నవారికి అక్కడే ఉపాధి కల్పించాలి. కానీ ఆ దిశలో జరుగుతున్న కృషి నామమాత్రంగానే ఉంటోంది. దీంతో ఉపాధి లేమితో పాటు, పేదరికం, నిరక్షరాస్యత అన్నీ కలసి వెరసి బడుగుజీవుల బతుకులను తలకిందులు చేస్తున్నాయి.

నేటికీ కరోనా విలయతాండవం తగ్గకపోగా ఇంకా భయంకరంగా విజృంభిస్తూనే ఉంది. అన్ని రంగాలను కకావికలం చేస్తూనే ఉంది. ఈ కష్టకాలం ఇలా ఎంతకాలం ఉంటుందో తెలియని పరిస్థితి. దీంతో జీవనోపాధి కోసం ఉపాధి పనులు కోరుకునే వారి సంఖ్య కూడా అపరిమితంగా పెరిగిపోతుండడంతో ఇంకా మరెన్నో కోట్ల మందికి నిత్యం ఉపాధి కల్పించడమంటే చిన్న విషయమేమీకాదు. అయినా సరే, పేదలకు అన్నివిధాలా చేయూతనిచ్చి వారి బతుకులను నిలబెట్టేందుకు అన్ని మార్గాలను ప్రభుత్వాలు అన్వేషించాల్సి ఉంది.

అందులో ముఖ్యంగా.. ఎంతోమందికి అన్నం పెట్టి వారి జీవితాలను కాపాడే ఉపాధి హామీ పథకాన్ని మరింతగా విస్తరించేందుకు కేంద్రప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు బాగా ఆలోచించి ఒక సంయుక్త కార్యాచరణకు ప్రణాళికలను రూపొందించి అమలుచేయాల్సి ఉంది. ఈ పథకాన్ని వీలైనంతగా విస్తరించి, వీలైనంతమంది పేదలకు పని కల్పించి, వారి కుటుంబాలకు ఆసరాగా ఇప్పటికంటే మరింత మెరుగైన వేతనాలిచ్చి, వారు చేసిన పనికి ఏరోజుకారోజు వేతనాలు చెల్లించే వ్యవస్థను ప్రభుత్వాలు మరింతగా పదునుపెట్టాలి. ఉపాధిహామీ పథకం నిధుల కొరత లేకుండా.. మరింత క్రమబద్ధంగా అమలు జరిగితే ఎంతోమంది పేదలకు ఉపాధి లభించే అవకాశం ఉంది కనుక ఆ దిశగా ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకొని పేదల ఉపాధికి హామీ ఇవ్వాల్సి ఉంది. ఉపాధి హామీని వ్యవసాయరంగంతో అనుసంధానించడం ద్వారా బడుగుజీవులకు బతుకుతెరువు కల్పించాల్సివుంది.

ఈ కష్టకాలంలో అటు వ్యవసాయ రంగం, ఇటు పారిశ్రామిక రంగం జమిలిగా తిరిగి జవసత్వాలు పుంజుకునేలా ప్రభుత్వాలు సమన్వయంతో యుద్ధప్రాతిపదికపై పనిచేసి ఆరుగాలం కష్టించి పనిచేసే కష్టజీవులను.. నిరుపేదలను, కార్మికులను, బడుగు బలహీనవర్గాల ప్రజానీకాన్ని ఈ కష్టాల కడగండ్ల నుంచి గట్టెక్కించి వారిని ఆదుకోవాల్సిన తక్షణ కర్తవ్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది.

## పేదలకు.. ఉపాధి ఏదీ?..



కరోనా మహమ్మారి వల్ల దేశంలోని అన్ని రంగాలు కుదేలైపోతున్నాయి. పరిశ్రమలు, వ్యాపారాలు, ఆర్థికవ్యవస్థలు అన్నీ చతికిలబడిపోతున్నాయి. దీంతో ఎంతోమంది పేదలు ఉపాధి కరువై అల్లాడిపోతున్నారు. దేశంలోని కోట్లాదిమంది బడుగు ప్రజలకు, రెక్కాడితే గానీ డొక్కాడని కష్టజీవులకు ఉపాధి కల్పించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉన్నా..అది నానాటికీ నిధుల్లేక నీరసపడిపోతోంది. ప్రభుత్వాలు ఈ పథకానికి మరింత ఆర్థిక పరిపుష్టి కల్పించి కష్టాల్లో ఉన్న పేదలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

---

ఈ-మెయిల్ ప్రజావాణి roopagroup@yahoo.com

### యూనివర్సిటీ కూడా వెళ్ళిపోతుంటే...

## 'జై నెల్లూరు' ఉద్యమం తప్పదేమో

'నెల్లూరు నిల్లూరు కానుందా' అని గత వారం 'లాయర్'లో వచ్చిన వ్యాసం ఆలోచింపజేస్తోంది. మీరు పేర్కొన్నట్లుగా జరిగితే 'జై నెల్లూరు' ఉద్యమం ఖచ్చితంగా తెరపైకి రాక తప్పదు. అనాదిగా నెల్లూరు నిరాదరణకు గురవుతూనే వుంది. రాయలసీమ వాళ్ళు నెల్లూరు మాది కాదంటారు, కోస్తా వాసులు నెల్లూరును వేరుగా చూస్తారు. మొదటి నుండీ తెలంగాణ, ఆంధ్రా(కోస్తా), రాయలసీమ అని పేర్కొన్నప్పుడల్లా నెల్లూరును ప్రత్యేకంగా చెప్పేవారు. కవులు సినిమా పాటలు రాసేటప్పుడు కూడా నెల్లూరును విడదీసి రాస్తారు. ఇప్పుడు నెల్లూరులో వున్న అరాకొరా పరిశ్రమలు, ఆర్థిక వనరులూ తీసుకెళ్లి బాలాజీ జిల్లాలో కలిపే ప్రయత్నం జరగడం అన్యాయం. మీరు రాసిన వార్తలో విక్రమ సింహపురి యూనివర్సిటీని మరిచారు, వేంకటాచలం మండలం సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోకి వస్తుంది కాబట్టి యూనివర్సిటీ కూడా వెళ్ళిపోతుంది.

**తండ్రి ఇచ్చినవి కొడుకు లాగేస్తాడా...?**

మేనకూరు, చింతవరం పారిశ్రామిక వాడలతో పాటు శ్రీసిటీ, కృష్ణపట్నం పోర్టులతో పాటు విక్రమ సింహపురి యునివర్సిటీ వంటివి నెల్లూరుజిల్లాకు రాజశేఖరరెడ్డి గారు ఇచ్చిన వరాలు. ఇప్పుడు ఆయన కొడుకు వచ్చి ఇవన్నీ మరో జిల్లాలో కలిపేయాలనే ఆలోచన చెయ్యడం సబబు కాదు. కడప జిల్లా జగన్మోహన్ రెడ్డికి పుట్టినిల్లైతే, నెల్లూరు మెట్టినిల్లు లాంటిది. జగన్‌కు అన్ని సమయాల్లో అండగా నిలిచి ఈ జిల్లా ఆయనకు, ఆయన పార్టీకి బ్రహ్మరథం పట్టింది. అలాంటి నెల్లూరుజిల్లా అనాథ కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయనతోపాటు జిల్లా నేతలపై కూడా వుంది. మేధావులకు సైతం ఇది ఆలోచించాల్సిన సమయం. ఇదే జరిగితే ఉద్యమించాల్సిన తరుణం.

వి.ప్రసాదరావు, నెల్లూరు.

## కొత్త కమిషనర్‌కి స్వాగతం

నెల్లూరు నగరానికి మునిసిపల్ కమిషనర్‌గా చాలారోజులకి మళ్ళీ ఐఏఎస్ అధికారి వచ్చాడని పత్రికలలో చదివి చాలా సంతోషం కలిగింది. నెల్లూరు కార్పొరేషన్‌గా మారి 16సంవత్సరాలైనా ఇప్పటివరకూ ఆ ఛాయలు కూడా నగరంలో ఎక్కడా కనపడవు. మున్సిపాలిటీగా ఉన్నన్నాళ్లూ ముష్టిపాలిటీగానే వర్ధిల్లింది. ఆ తరువాత కార్పొరేషన్‌గా స్థాయి పెరిగింది తప్ప రూపు మారలేదు. అక్కడక్కడా పార్కులూ రోడ్డులూ మెరుగుపడ్డాయే కాని పరిశుభ్రత మాత్రం శూన్యం. ఇక అక్రమ కట్టడాలకు, మునిసిపల్ సిబ్బంది అవినీతి, ఆగడాలకు అడ్డు అదుపు లేదు. ఈ కార్పొరేషన్‌లో అనాదిగా రాజకీయ నాయకులదే ఆధిపత్యం. ఏ పనైనా వారి కనుసన్నలలోనే జరగాలి, వారి పెత్తనమే సాగాలి. ఇది కొత్తగా వచ్చిన సంప్రదాయం కాదు. ఇప్పుడొచ్చిన కమిషనర్ గారు యువకుడుగా కనపడుతున్నాడు, పైగా ఐఏఎస్. చూడాలి మరి తన ఐఏఎస్ ప్రతాపం చూపిస్తాడో లేక ఈయన కూడా అయ్యా ఎస్ అని లొంగిపోతాడో...? ఏది ఏమైనా కొత్త కమిషనర్‌కి వెల్కమ్ చెబుదాం.

ఆర్.పి.రామయ్య, కొండాయపాళెం.

## పాతతరం వాళ్ళు ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నారు...

ఇటీవల నెల్లూరులో మరణాలు ఎక్కువయ్యాయి. కరోనా కావచ్చు మరేదైనా కావొచ్చు పాతతరం పెద్దతలలు ఒక్కొక్కటిగా రాలిపోతున్నాయి. మా గురువు గారు సన్నపురెడ్డి రాఘవరెడ్డి గారు, సేవా తత్పరులు గణేశం కృష్ణారెడ్డి గారు, సీనియర్ జర్నలిస్టు జొన్నలగడ్డ మార్కండేయులు గారు, ముఖ్యంగా వైశ్య ప్రముఖులు అచ్యుత సుబ్రహ్మణ్యం గారు, వొమ్మిన సుబ్రహ్మణ్యం గారు, కారంశెట్టి వెంకట రామయ్య గారు, అయితా ఆనంద కృష్ణయ్య గారలు జిల్లా ఆర్య వైశ్య సంక్షేమానికి చాలా కృషి చేశారు. కస్తూరిదేవి విద్యాలయాల నిర్వాహకులు జె.వి.రెడ్డి గారు చాలా మందికి రోల్‌మోడల్. అయన సమయపాలన, వస్త్రధారణ, నడక ఠీవి చాలా మందికి ఆదర్శం. మా చిన్నప్పటి నుండి ఆయనను చూస్తున్నాం. కస్తూరిదేవి ఆస్తుల పరిరక్షణకు ఆయన చేసిన కృషి మరువలేనిది. స్వాతంత్ర సమరయోధులు రాయిపూడి దేవాదానం గారు కూడా జిల్లా గర్వించదగ్గ వ్యక్తి. ప్రతీ ఆగస్టు 15న జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆయనను సత్కరిస్తుంటే చూసి గర్వపడేవాడిని. మరో అధ్యాపకులు, ఆధ్యాత్మికవేత్త, మహనీయులు, మహానుభావులు స్వామి ప్రజ్ఞారణ్య గారు ఆదర్శ పురుషులు. వారి మరణం మరెంతో బాధాకరం.

ఇలా ఒక్కొక్కరూ వెళ్లిపోతుంటే మనసు బరువవుతోంది. 2020 ఇంకెన్ని చేదు జ్ఞాపకాలను మిగల్చబోతోందోనన్న భయం కలుగుతోంది. దివంగతులైన వారందరికీ నా నివాళి.

యం.రంగనాథ్, డల్లాస్, టెక్సాస్.

లాయర్
పాఠకులకు మనవి
మా(మీ) లాయర్ పత్రికకు
**సమాచారం / లేఖలు**
పంపదలచిన వారు
9866314741 నంబరుకు
వాట్సయాప్ ద్వారా గాని, లేదా
lawyerpatrika@gmail.comకి
ఈ-మెయిల్ ద్వారా గాని
పంపవలసిందిగా విజ్ఞప్తి.
పోస్టల్ చిరునామా :
ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,
మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.
- సం/-

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# మహిళాలోకానికి బాసటగా.. 'వైయస్సార్ ఆసరా'

- 3 కోట్ల మంది మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు
- ముఖ్యమంత్రి జగన్ మరో సాహసోపేత కార్యక్రమం



**రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి కనీవినీ ఎరుగని విధంగా మరో సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని 3కోట్ల మంది మహిళల పురోగతికి, వారి బిడ్డల భవిష్యత్తుకు బాటలు వేస్తూ ఈనెల 11న 'వైయస్సార్ ఆసరా' పథకాన్ని ప్రారంభించి ప్రజలందరి ప్రశంసలు అందుకున్నారు. మహిళల జీవనప్రమాణాలు మెరుగు పడేలా ఈ పథకాన్ని రూపొందించి అమలు చేస్తూ వైకాపా ప్రభుత్వమంటే మహిళా పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకున్నారు. అక్కచెల్లెమ్మల భవితకు అండగా 'నేనున్నా'నంటూ జగన్ మహిళల ఆర్థికాభివృద్ధికి తనవంతు చేయూతనందిస్తున్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో రాజన్న ఒకడుగు వేస్తే ఆయన తనయుడు జగన్ రెండడుగులు ముందుకు వేస్తూ ప్రజాముఖ్యమంత్రిగా అందరి అభిమానాన్ని పొందుతున్నాడు.**

పురుషులతో సమానంగా స్త్రీలు తమ కాళ్ళమీద నిలబడాలి. ఆర్థిక స్వావలంబనతో రాణిస్తూ తమ కుటుంబాలను పోషించుకోగలగాలి.. తద్వారా మహిళా సాధికారతను సాధించాలని ఎందరో నాయకులు ఎప్పుడూ చెప్పే మాటలే. అయితే, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ మాటలను నిజం చేస్తూ, మహిళల కలలను సాకారం చేస్తూ రాష్ట్రంలో మహిళలకు ఎన్నో రకాల పథకాలను అందిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. రాష్ట్రంలోని మహిళల పొదుపు బకాయిలు మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేరుస్తూ మహిళలందరి అభిమానానికి పాత్రులవుతున్నారు. ఇప్పటికే జగనన్న అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, వైయస్సార్ చేయూత, వైయస్సార్ సున్నా వడ్డీ పథకం.. ఇలా అనేక పథకాలను ప్రారంభించి ఎంతో పారదర్శకంగా అమలు చేస్తూ మహిళలందరి దీవెనలందుకుంటున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ తాజాగా రాష్ట్రవ్యాప్తంగా 8,71,302 పొదుపు సంఘాల్లో ఉన్న సుమారు 87.74 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుస్తూ 'వైయస్సార్ ఆసరా' పథకాన్ని ప్రారంభించడంతో మహిళాలోకంలో ఆనందం వెల్లువెత్తుతోంది. ఈ పథకంలో భాగంగా పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు నాలుగు విడతలుగా మొత్తం 27,168 కోట్ల రూపాయలను అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. తొలివిడతగా 6,792 కోట్ల రూపాయలను ఈనెల 11న సిఎం వైయస్ జగన్ ఆయా పొదుపు సంఘాలకు ఆసరాగా వారి సంఘాల ఖాతాల్లో జమచేయడంతో గతంలో జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లయింది. ఈ పథకాన్ని ప్రారంభిస్తూ సిఎం జగన్ మాట్లాడారు. 'రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నాడు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 30 లక్షల మంది అక్కచెల్లమ్మలకు ఇళ్ళ స్థలాల పట్టాలు ఇవ్వడానికి సిద్ధమయ్యామని, అయితే గిట్టనివారు కొందరు తమ పునాదులు కదులుతాయనే భయంతో కోర్టులకు వెళ్ళడంతో ఆ కార్యక్రమం ఆగిపోయిందని, దేవుడి దయతో త్వరలోనే వాటిని పంపిణీ చేస్తామని' ఆయన తెలిపాడు.

### కాపు మహిళలకు 75వేల ఆర్థికసాయం :

పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలందరికీ సున్నా వడ్డీ కోసం 1400 కోట్ల రూపాయలను నేరుగా వారి ఖాతాల్లో జమచేశామని, 'కాపు నేస్తం' పథకం ద్వారా అయిదేళ్లలో మొత్తం 75వేల రూపాయలు ఆర్థికసాయం చేస్తామని, తొలి ఏడాది ఇప్పటికే 15వేలు ఇచ్చామని సిఎం ఈ సందర్భంగా చెప్పారు. ఒంటరి మహిళలు, వితంతువులతో పాటు 60 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్క వృద్ధురాలికి పింఛన్లు ఇస్తున్నామని, 60లక్షల మందికి ఒక్కొక్కరికి 2250 రూపాయల వంతున ప్రతినెలా 1వ తేదిన వారి ఇళ్లవద్దకే వెళ్ళి పింఛన్లు అందజేస్తున్నామని, ఇందుకోసం నెలకు 1500కోట్లు వెచ్చిస్తున్నామని వివరించారు.

### జిల్లాలో తొలి విడతగా 340 కోట్లు :

వైయస్సార్ ఆసరా పథకం కింద జిల్లాలో తొలివిడతగా 4.19లక్షల మహిళలకు వారి ఖాతాల్లో ప్రభుత్వం 340.01 కోట్ల రూపాయలు జమచేసింది. నెల్లూరులోని జడ్పీ ఆవరణలో ఈనెల 11న రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ అనిల్ కుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, జాయింట్ కలెక్టర్(ఆసరా) సూర్య ప్రకాష్‌రావు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌వి నాగేశ్వరరావు, వైకాపా నాయకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొని ఆ చెక్కులను మహిళా సంఘాలకు అందజేయడంతో జిల్లాలోని మహిళా సంఘాల్లో హర్షాతిరేకాలు వెల్లడయ్యాయి. వైయస్సార్ ఆసరా పథకం కింద జిల్లాలోని 42,107 స్వయం సహాయక బృందాల్లోని 4,19,193 మందికి మొత్తం 1360.22 కోట్లు అందించనున్నారు. అందులో తొలి విడతగా ఇప్పుడు 340.01కోట్ల రూపాయలను పొదుపు మహిళల బ్యాంకు అకౌంట్లలో జమ చేశారు. గత టిడిపి ప్రభుత్వం తీరు వల్ల తాము అప్పుల పాలయ్యామని, ఆ అప్పులు తీర్చేందుకు ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమాయత్తం కావడం తమకెంతో ఆనందంగా ఉందంటూ మహిళలు కొనియాడారు. కరోనా నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలు అమలుచేస్తుండడం పట్ల రాష్ట్ర ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# తండ్రికి మించిన తనయుడు సీఎం జగన్

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



రాష్ట్రంలో ఉన్న రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, రైతన్నల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలుచేస్తూ వారి బాగుకు అహర్నిశలు కృషిచేస్తున్నారని, ప్రజాసంక్షేమ కార్యక్రమాల అమలులో సిఎం జగన్ తండ్రికి మించిన తనయుడనిపించుకుంటున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కొనియాడారు. ఈనెల 12న ఆయన నాయుడుపేటలోని కెకె కల్యాణసదన్‌లో జరిగిన ఎన్‌డిసిసిబి డైరెక్టర్ల సదస్సులో ఆ సంస్థ డైరెక్టర్ ఆనం విజయకుమార్‌రెడ్డితో కలసి పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించిన రైతుభరోసా కేంద్రాల వల్ల ఎంతోమంది రైతులు పురోగతిని సాధిస్తున్నారన్నారు. ఆనం విజయ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన జరుగుతోందన్నారు. సిఎం జగన్ ఆధ్వర్యంలో రైతుల సొసైటీలు ఎంతో అభివృద్ధి చెందుతాయని, సొసైటీల అభివృద్ధికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తూ రైతులను కష్టాల నుంచి ఆదుకుంటోందన్నారు. రూ.300కోట్ల వ్యయంతో ప్రతి మండలంలో వ్యవసాయ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. అనంతరం ఆనం విజయకుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు ఘనంగా సత్కరించారు. ఎన్‌డిసిసిబి డైరెక్టర్ సోమశేఖర్‌రెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి, రాధా కిశోర్‌యాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, వేణుంబాక విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


20వ వర్ధంతి



కీ॥శే॥ శ్రీ జక్కా రంగారెడ్డి

(మరణం - 18.09.2000)

మహనీయుని దివ్యస్మృతికి మా భాష్పాంజలి

భార్య : జక్కా కామేశ్వరమ్మ

కుమారులు

జక్కా కోదండరామిరెడ్డి

జక్కా శ్రీనివాసులురెడ్డి

జక్కా శివనారాయణరెడ్డి

మరియు కుటుంబసభ్యులు



www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

Please note the change

# నెల్లూరు కబుర్లు

## ఫోన్ చేస్తే చాలు..

# సమస్యలు తీరుస్తా

కొత్త కమిషనర్ దినేష్‌కుమార్



ప్రజలకు ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంటానని, ఫోన్ చేసినా, వాట్సాప్ చేసినా సరే వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నెల్లూరు నగరపాలక సంస్థకు కొత్త కమిషనర్‌గా ఈనెల 14న నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన కోతమాసు దినేష్‌కుమార్ చెప్పారు. ప్రజలకు తాగునీరు అనునిత్యం అందించేందుకు,పారిశుద్ధ్యం పరిరక్షించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటానని, తన నెంబరు 98499 06609కు ఫోన్ చేసినా చాలు వెంటనే సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు, ఉద్యోగులు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నా తన దృష్టికి తీసుకురావచ్చని, నెల్లూరును సుందరనగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా కరోనా రహిత నెల్లూరే లక్ష్యంగా కృషిచేస్తానన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన దినేష్‌కుమార్‌కు ఇన్‌చార్జి అడిషనల్ కమిషనర్ ప్రసాద్, కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, ఇ.ఇ మహేష్, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు చెప్పారు.

### పారిశుద్ధ్యం మెరుగుపడాలి :

నగరంలో పారిశుద్ధ్యం పరిస్థితి బాగా లేదని కొత్త కమిషనర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇకనైనా పనితీరు మెరుగుపరుచుకోవాలని కొత్త కమిషనర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. ఈనెల 14న ఆయన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం అధికారులతో సమావేశమై నగరంలోని పారిశుద్ధ్య పరిస్థితిని ప్రజారోగ్యశాఖ అధికారి వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. తాను ఉదయం 5.30 గంటలకే వార్డుల్లోకి పరిశీలనకు వస్తానని, రోడ్లపై చిన్న చెత్తకాగితం కూడా కనిపించకుండా అందరూ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. నగరంలో కోవిడ్ వైరస్ విజృంభణ నేపథ్యంలో కార్పొరేషన్ తరపున చేపట్టాల్సిన పనులను, వార్డు వాలంటీర్ల పరీక్షలు తదితర అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు.

## జెఇఇలో విశ్వసాయి విజయాలు



ఇటీవల ప్రకటించిన జెఇఇ మెయిన్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాలకు చెందిన 121 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలిచారని, వీరిలో పి.జ్ఞానేందర్‌రెడ్డి జాతీయస్థాయిలో 20(ఆర్)వ ర్యాంకు, యన్ కౌషిక్ 226(ఆర్)వ ర్యాంకు సాధించారని, జెఇఇ అడ్వాన్స్ (ఐఐటి)కి 121 మంది విద్యార్థులు అర్హత సాధించారని విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మన్ డా.ఎన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ విజయాలను సాధించిన విద్యార్థులందరికీ పుష్పగుచ్ఛాలిచ్చి వారు అభినందనలు తెలిపారు.

## పొణకా కనకమ్మ, దువ్వూరులకు నివాళులు

పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 15న నగరంలోని పొణకా కనకమ్మ మెమోరియల్ పాఠశాలలో సమితి కన్వీనర్ బి.సురేంద్రనాథ్‌రెడ్డి పొణకా కనకమ్మ, కవికోకిల దువ్వూరు రామిరెడ్డిలకు నివాళులర్పించారు. ప్రముఖ సాహితీవేత్తలు ఆలూరు శిరోమణిశర్మ, డా.కరిమద్దెల నరసింహారెడ్డి పాల్గొని పొణకా కనకమ్మ సేవలను, దువ్వూరు సాహితీవైభవాన్ని వివరించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జీవపుత్రకుమార్ చేతులమీదుగా దాతలు తయారు చేయించిన డెస్క్‌లను పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. గూడూరు లక్ష్మి అధ్యక్షత వహించి దాతలకు, ఉపన్యాసకులకు ధన్యవాదాలు తెలిపారు.

## 25 వరకు లాక్‌డౌన్

కరోనా నియంత్రణలో భాగంగా నెల్లూరు నగరంలో ఈనెల 16 నుంచి 25వ తేది వరకు లాక్‌డౌన్ పొడిగిస్తున్నామని, ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దుకాణాలు తెరచి ఉంటాయని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల 15న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా సహకరిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలందరూ ఇందుకు సహకరించాలని, కరోనా కట్టడికి ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఏపిటిఎఫ్

## కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపిటిఎఫ్) జిల్లా కొత్త కార్యవర్గం ఈనెల 13న ఎంపికైంది. నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో జరిగిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు సారథ్యంలో ఈ ఎంపికలు జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా సిహెచ్ శివరామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా ఏ.సురేంద్రరెడ్డి ఏకగ్రీవంగా ఎంపిక కాగా, ప్రధాన కార్యదర్శిగా టి.మస్తానయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌దాస్, చిరంజీవి, రియాజ్, జుల్ఫికర్ ఆలీ, బాలకృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, శివకోటారెడ్డి, భాస్కర్ రెడ్డి, సురేంద్ర, హజరత్, వెంకటేశ్వర్లురెడ్డి, సుధాకర్‌రెడ్డి, జనార్ధన్‌లు ఎంపికయ్యారు.

కలెక్టరేట్ పరిపాలనాధికారిగా

## పి.సుబ్రహ్మణ్యం

కలెక్టరేట్ పరిపాలనాధికారిగా పి.సుబ్రహ్మణ్యం ఈనెల 12న బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు చెక్‌పోస్ట్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతిపై జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కలెక్టరేట్ ఏ.ఓగా నియమించారు. ఆయనతో పాటు 16మంది తహశీల్దార్లు, డెప్యూటీ తహశీల్దార్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి కలెక్టర్ తాజాగా ఉత్తర్వులిచ్చారు. ఇందులో భాగంగా ఈ నియామకం జరిగింది. ఈ స్థానంలో పనిచేస్తున్న రామారావును కలెక్టరేట్ సి-సెక్షన్‌కు బదిలీ చేశారు.

## ఆర్టీసి రైట్.. రైట్

కరోనా నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఇప్పుడిప్పుడే ప్రయాణాలకు సిద్ధమవుతున్నారు. దీంతో ఆర్టీసి అధికారులు కూడా ప్రయాణీకులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలోని పది డిపోల నుంచి 220 బస్సులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈనెల 14 నుంచి ఆ బస్సులతో పాటు మరో వంద బస్సులను కూడా ప్రయాణాలకు సిద్ధం చేశారు. ప్రయాణీకుల రద్దీ ఉండే ప్రాంతాలకు అదనపు ట్రిప్‌లను వేయడం ప్రారంభించారు. కోవిడ్ నియంత్రణ చర్యలు బాగా పాటిస్తుండడంతో ఆర్టీసీలో ప్రయాణానికి జనం ముందుకొస్తున్నారు.

## గోవర్ధనగిరి అలంకారంలో వేణుగోపాలుడు

నెల్లూరులోని మూలాపేటలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ద్రవిడ సంప్రదాయ పద్ధతిలో జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న స్వామివారికి శోభాయమానంగా గోవర్ధనగిరి అలంకారం నిర్వహించారు. తొలుత స్వామివారికి, అమ్మవార్లకు తిరుమంజనసేవ, ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి, ఆలయ ఇ.ఓ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామివార్లకు ఈ వేడుకలు జరిగాయి.

## ఆలయాల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- నిర్వాహకులకు పోలీసు అధికారుల సూచన**

ఆలయాల భద్రత పట్ల ఆలయాల కార్యనిర్వాహణాధికారులు, ధర్మకర్తలు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. ఈనెల 14న నెల్లూరు నవాబుపేటలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలోను, మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ ఆలయాల అధికారులు, ధర్మకర్తలతో పోలీసు అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండవ నగర ఇన్స్‌పెక్టర్ వేమారెడ్డి దుర్గామల్లేశ్వర్వస్వామి ఆలయాన్ని పరిశీలించి సిసి కెమెరాల ఏర్పాటుపై తగు సూచనలిచ్చారు. ఆలయాల భద్రతకు ప్రభుత్వం జారీ చేసిన సూచనలను వారికి వివరించారు. ఆలయాల భద్రత విషయంలో అందరూ ఏమరుపాటు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ దాసరి రాజశేఖర్, ఆలయ ఛైర్మెన్ వి.శ్రీనివాసులురెడ్డి, ఇ.ఓ నవీన్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ పుట్టినరోజున

## బిజెపి నాయకుల సేవలు

ప్రధాని మోడీ పుట్టినరోజు వేడుకలను ఈనెల 14న నెల్లూరులో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, మాస్కులు, శానిటైజర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ మాట్లాడుతూ ఈ వేడుకల్లో భాగంగా సేవా కార్యక్రమాలను వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, కాకు విజయలక్ష్మి, రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నాయకులు మిడతల రమేష్, రాధాకృష్ణ, కోట వెంకటేశ్వర్లు, బుజ్జిరెడ్డి, రఘురామరాజు, విజయకుమార్, శ్రీనివాసులు, సుధీర్, యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మోటార్లకు మీటర్ల ఏర్పాటు వద్దు

**- కలెక్టర్‌కు నాయకుల వినతి**

రైతులు వ్యవసాయానికి వాడే విద్యుత్ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుచేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని, విద్యుత్ నగదు బదిలీ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయాలని కోరుతూ అఖిలపక్ష సమన్వయ కమిటీ నాయకులు అబ్దుల్ అజీజ్, రామరాజు తదితరులు ఈనెల 15న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. రైతులకు ఈ సంస్కరణలు ఉపయుక్తం కావని వారు పేర్కొంటూ జిఓ నెం.22ను రద్దుచేయాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో ఎడగారు సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు.

ప్రపంచం గర్వించదగిన

## ఇంజనీర్ మోక్షగుండం

**ఇంజనీర్స్ డేలో కొనియాడిన వక్తలు**

ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈనెల 15న నెల్లూరులోని హరనాథపురంలో ఉన్న నీటిపారుదల ఇంజనీర్ల కార్యాలయంలో ఇంజనీరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. దేశమే కాదు యావత్ ప్రపంచం గర్వించదగిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని అంటూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భావితరాల వారికి ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఇ హరినారాయణరెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్ఇ వరలక్ష్మి, సోమశిల ప్రాజెక్టు సర్కిల్ ఎస్ఇ కృష్ణారావు, సెంట్రల్ డివిజన్ ఇఇ కృష్ణమోహన్, ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఆర్.హరీష్‌కుమార్, బాలసుబ్రహ్మణ్యం, రాజేంద్రప్రసాద్, వినోద్‌కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. కరోనా నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అందరూ మాస్కులు ధరించి సామాజిక దూరం పాటిస్తూ ఆ మహనీయునికి నివాళులర్పించారు.

## 82వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం

**పౌరసరఫరాల డిఎం రోజ్‌మాండ్**

జిల్లాలో రబీకి సంబంధించి ఇప్పటిదాకా రైతుల నుంచి 82,041 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ డి.ఎం రోజ్‌మాండ్ ఈనెల 12న ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

## హాస్టళ్ళలో మొక్కలు నాటాలి

**బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య**

జిల్లాలోని బీసీ హాస్టళ్ళలో పచ్చదనం పెంపొందించేందుకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వై.వెంకటయ్య ఆదేశించారు. విడవలూరు బీసీ బాలుర వసతిగృహంలో ఈనెల 13న ఆయన మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మంచి గాలి, వాతావరణం ఏర్పడాలంటే మొక్కలు విరివిగా నాటి పరిరక్షించాలన్నారు. విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యత గురించి బాగా అవగాహన కల్పించాలని ఆయన సంబంధిత సిబ్బందికి వివరించారు.

Please note the change

www.lawyerteluguweekly.com is now www.lawyerpatrika.com




# 'మినీ జపాన్'గా శ్రీసిటీ

## - జపాన్ కాన్సులేట్ జనరల్‌తో ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ 'మినీ జపాన్'గా ప్రఖ్యాతి చెందుతుందని, ఎందుకంటే జపాన్‌కు చెందిన ఆటోమొబైల్, ఇంజినీరింగ్, లాజిస్టిక్ వంటి వివిధ రంగాల్లో విఖ్యాతి గడించిన 24 పరిశ్రమలు శ్రీసిటీలో కొలువుదీరాయని, ఈ పరిశ్రమలన్నింటిలో సుమారు 9500 కోట్ల పెట్టుబడులతో పాటు పదివేలమందికి పైగానే ఉపాధి అవకాశాలు పొందుతున్నారని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి జపాన్ కాన్సులేట్ జనరల్ టగా మసుయుకితో అన్నారు. చెన్నైలోని జపాన్ కాన్సులేట్ జనరల్ మసుయుకి ఈనెల 14న శ్రీసిటీని సందర్శించడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ఆయన్ను సాదరంగా స్వాగతించి శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. 27 దేశాలకు చెందిన 187 పారిశ్రామిక సంస్థలకు అవసరమైన అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, అనువైన వాతావరణ కల్పించడంతో పాటు జపాన్ పరిశ్రమలకు ప్రత్యేకంగా ఒక ఎన్‌క్లేవ్‌ను కూడా ఇక్కడ అభివృద్ధిచేశామని వివరించారు. జపాన్ నుంచి ఇంకా మరికొన్ని పరిశ్రమలు శ్రీసిటీకి తరలివస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చురుకైన పారిశ్రామిక విధానాల ఫలితంగా నేడు రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి బాగా జరుగుతోందన్నారు. శ్రీసిటీలోని మౌలిక వసతులు బాగున్నాయని, మరిన్ని జపాన్ పరిశ్రమలు శ్రీసిటీకి రావడానికి ఆసక్తి చూపుతాయని జపాన్ కాన్సులేట్ జనరల్ సంతృప్తి వ్యక్తం చేశారు.

### శ్రీసిటీని సందర్శించిన ప్రతాప్ భీమిరెడ్డి

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రోత్సాహం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ప్రతాప్ భీమిరెడ్డి ఈనెల 15న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి శ్రీసిటీలో ఉన్న ప్రపంచశ్రేణి మౌలికవసతులను వివరించారు. జపాన్ కాన్సులేట్ జనరల్ మసుయుకితో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ప్రతాప్ భీమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా శ్రీసిటీ అవతరించిందని, త్వరలో దేశంలో అతిపెద్ద జపనీస్ పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ మారుతుందని ఆకాంక్షించారు.

# కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపండి



## - అధికారులకు మంత్రి అనిల్ ఆదేశాలు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ ఈనెల 12న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి నెల్లూరు నగరంలోని పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న డిఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణంలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలు పరిశీలించారు. వీటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొత్త భవనాలు నిర్మించిన తర్వాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన అన్ని విభాగాలను ఇక్కడికి తరలించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్‌లతో పాటు ఇన్‌చార్జి డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకట ప్రసాద్, విజయా డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఎంహెచ్ఓ వెంకటరమణ, వైకాపా నాయకులు వైవి రామిరెడ్డి, వందవాశి రంగా, నూనె మల్లికార్జునయాదవ్, కుంచాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### మరిన్ని వాటర్‌ప్లాంట్‌లు :

నెల్లూరు నగరంలో ప్రజలకు మంచినీటి కొరత లేకుండా మరిన్ని వాటర్ ప్లాంట్‌లు సిద్ధమవుతున్నాయని, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. ఈనెల 12న ఆయన నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ గతంలో నగరంలోని అనేక డివిజన్లలో తన సొంత నిధులతో వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటుచేసిన విష యాన్ని గుర్తుచేశారు. వైయస్సార్‌పి యువ జన విభాగం జిల్లా అధ్యక్షుడు రూప్‌కుమార్ యాదవ్, విజయా డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నాయకులు దేవరకొండ అశోక్, వెంకట రమణ పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 15న ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకుంటూ ఆయన చేపట్టిన వివిధ రకాల ప్రాజెక్టులను, గొప్ప నిర్మాణాలను గురించి విద్యార్థులకు వివరించారు. నేటి తరం విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్‌లో గూగుల్‌మీట్ ద్వారా విద్యార్థినీ విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డా.డి.శ్రీనివాస్‌తో పాటు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రైవేటు వాహనాలతో లేనిపోని తిప్పలు...

# సురక్షిత ప్రయాణాలు ఆర్టీసీలోనే



***ఈ మాయదారి కరోనా రానే వచ్చింది కానీ జనానికి అన్నీ అవస్థలే. ఎక్కడికి వెళ్ళాలన్నా లోలోపల భయమే. ఎప్పుడు ఎక్కడ ఎలా ఈ వ్యాధి వచ్చి అంటుకుంటుందో తెలియదు. దీంతో ప్రభుత్వాలు సూచిస్తున్నట్లుగా ఎవరికి వారు జాగ్రత్తలు పాటిస్తూ, స్వీయరక్షణలోనే ఉండడం శ్రేయస్కరం.***

ఈ కరోనా కష్టకాలంలో ఇరుగు పొరుగు ఇళ్ళకు వెళ్ళాలన్నా ఆచితూచి అడుగు వేయాల్సి వస్తోంది. ఫోన్లున్నాయి కదా హాయిగా ఎంతసేపైనా మాట్లాడుకో వచ్చు. మనవల్ల వాళ్ళకు ఇబ్బంది లేకుండా, వాళ్ళ వల్ల మనకు ఇబ్బంది లేకుండా ఎవరి జాగ్రత్తల్లో వాళ్ళుండ డమే ఉత్తమమని విజ్ఞులైన ప్రజలంతా భావిస్తున్నారు. అందుకే ఎంత అభిమాన మైనా, ఎంత ఆత్మీయులైనా, ఎంతగా ప్రాణమిచ్చే మిత్రులు, బంధువులైనా, సొంత కుటుంబసభ్యులైనా సరే..వారు దూరప్రాంతాల్లో ఉంటే నేరుగా వెళ్ళి చూడడానికి కూడా వేచి చూస్తున్నారు. ఈ మహమ్మారి కరోనా పోయేదాకా ఈ 'దూరం' తప్పదు మరి!...

### వాహనాలతో జాగ్రత్త!

అందులోనూ ఈ కరోనా దెబ్బతో ఏ ఊరికి వెళ్ళాలన్నా వాహనాలు కూడా కరువే. ఇక వాహనాల్లో పోట్ల సంగతి చెప్పనే అక్కరలేదు. అత్యవసరమై ఏదైనా చిన్నదో పెద్దదో నాలుగుచక్రాల వాహనం కనిపించింది కదా అని ఎక్కేస్తే లేనిపోని చిక్కులే. ఆచితూచి వాహనమెక్కాలి. కొన్ని ప్రైవేట్ వాహనాల్లో ఎలాంటి రక్షణ చర్యలుండవు. అట్లని ఒక్కరమే వాహనం మాట్లాడుకోవాలంటే ఆ ఛార్జీలు మనం భరాయించలేం. అప్పటికే ఆ వాహనాల్లో ఉన్నవారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో మనకెలా తెలుస్తుంది?.. వారు దగ్గుతుం టేనో.. తుమ్ముతుంటేనో లోపల ఇరుక్కుని కూర్చున్న మన పరిస్థితి ఏమిటి?..అన్నీ అనుమానాలే. రోజువారీ వ్యాపారాలకు వాహనాల్లో తప్పనిసరై తిరిగేవారికి, నిత్యం వివిధ ప్రాంతాల్లో విధుల నిర్వహణకు వెళ్ళేవారికి ఎంతోమందికి ఇలా వాహ నాల తిప్పలు తప్పడం లేదు. అయినా, ఎవరి జాగ్రత్తల్లో వారు ప్రయాణం సాగిం చుకోవడానికి ఎలాంటి సురక్షిత వాహనం వినియోగించుకోవాలో ఎవరికి వారు తెలుసుకోవాలే తప్ప.. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదు. తస్మాత్ జాగ్రత్త!.. ఇప్పటికే ఎంతోమంది ప్రభు త్వాలు చెప్తున్న సూచనలు పాటిస్తూ కరోనా బారిన పడకుండా ఎవరి జాగ్రత్తల్లో వారుంటున్నందుకు అందరం సంతోష పడాల్సిందే. బతికుంటే బలుసాకు తిని బతకొచ్చని, మన రక్షణకు మనమే శ్రద్ధ తీసుకోవాలనే తత్వం ఇప్పుడు అందరికీ బాగా బోధపడుతోంది.

### భద్రత ఆర్టీసీలోనే:



ఈ నేపథ్యంలో ప్రయాణానికి ఎంతో అనువైనవి, మనకు అన్ని విధాలా సురక్షిత మైనవి ఆర్టీసి బస్సులే. కరోనా నిబంధ నలతో ప్రతి బస్సును బస్టాండులోకి రాక ముందే గ్యారేజీలో శ్యానిటైజ్ చేసి ప్రయా ణీకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యం చేర్చే దివ్యమైన వాహనాలు అవే. బస్సుల్లో ప్రయాణీకులను కూడా అతుక్కు న్నట్లు కూచోకుండా.. సామాజిక దూరం పాటించేలా చేస్తూ.. కోవిడ్ వైరస్ వ్యాప్తి చెందకుండా అన్ని రకాల ముందుజాగ్ర త్తలు తీసుకుంటూ జాగ్రత్తగా ప్రయాణాలు సాగించే ఆర్టీసి బస్సులు మన పాలిట వరాలు. అయితే, దురదృష్టం ఈ కరోనా దెబ్బకు ఇటీవలి కాలంలో ప్రయాణాలు చేసేవారు బాగా మందగించడంతో ఆర్టీసి నష్టాల పాలవుతోండడం ఎంతైనా బాధా కరం. అయినా సరే, ప్రజలకు సురక్షిత మైన ప్రయాణాలు అందించేందుకు ఆర్టీసి ప్రజల సౌకర్యం కోసం అన్ని సన్నాహాలు చేస్తూనే ఉండడం విశేషం. అందుకే, బస్సుల్లో కోవిడ్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తోంది. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 50 సీట్లు ఉంటే వాటిలో సామాజిక దూరం పాటించేలా ప్రయాణీకులను కూర్చో బెడుతూ కేవలం 30మంది ప్రయాణి కులను మాత్రమే అనుమతిస్తోంది. అదేవిధంగా సూపర్ లగ్జరీ బస్సుల్లో 36 సీట్లుంటే 26 మందినే లోపలికి అనుమ తిస్తోంది. డీలక్సు బస్సుల్లో 40 సీట్లకు 29 మందినే రానిస్తోంది. పల్లెవెలుగు బస్సుల్లోనైతే 54 సీట్లున్నా 30 మందికే సీటు. ఇలా జిల్లాలోని ప్రతిడిపోలో ఉన్న ఆర్టీసి బస్సులు ముందుజాగ్రత్తలతో ప్రయాణాలు చేస్తున్నాయి. అసలు మాస్కులు లేకుండా ఎవరినీ ఎక్కించుకోవడం లేదు. కోవిడ్ వైరస్ పట్ల ఎంతో అప్రమత్తంగా ఉంటూ, సరైన సమయానికి ప్రయాణీకు లను సురక్షితంగా గమ్యానికి చేరుస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది ఆర్టీసీ. ఇంతకంటే భద్రత మనకింకేం కావాలి? జిల్లాలో ఇప్పటిదాకా 220 బస్సులను తిప్పుతున్న ఆర్టీసి, లాక్‌డౌన్ సడలింపు లతో గత రెండుమూడు రోజులుగా జిల్లాలో ప్రయాణీకుల సౌకర్యార్థం మరో వంద బస్సులను పెంచింది కూడా. అందువల్ల ఇకనైనా ఇష్టం వచ్చినరీతిలో తిరిగే ప్రైవేట్ వాహనాలను వదిలేసి.. క్రమశిక్షణ పాటించే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడం మనకు అన్నివిధాలా శ్రేయస్కరమని వేరే చెప్పనక్కర లేదు. ఇలాగైనా.. ఎల్లవేళలా మన క్షేమం కోరు కునే మన ఆర్టీసిని మెల్లిగా నష్టాల్లోంచి బయటపడేలా చూద్దాం!..

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com
Please note the change

# గూడూరు డివిజన్ వార్తలు

## బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో
# ఫలసరుకుల పంపిణీ



గూడూరులోని ఎస్.వి రత్నం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు అమ్మగారైన శ్రీకంటి సుబ్బరత్నమ్మ 8వ వర్ధంతి సందర్భంగా కరోనా, లాక్‌డౌన్‌లో ఇబ్బందిపడుతున్న బ్రాహ్మణులకు, నిరాశ్రయులకు ఎస్.వి రత్నం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ బియ్యం, ఫలసరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకంటి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మని, తాము ఇంత ఉన్నత స్థాయిలో ఉండడానికి కారణం తన తల్లి శ్రీకంటి సుబ్బరత్నమ్మ పెంచిన విధానమేనన్నారు. భవిష్యత్‌లోనూ పేదవారికి తనవంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని ఆయన తెలియజేశారు. గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, పవన్‌కుమార్, ఎస్.వి రత్నం చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది ధనుంజయ, హమీద్, శాంతి, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# కరోనా బాధితులకు మెరుగైన వైద్యసేవలు

**సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ**



కరోనా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని కోవిడ్ టాస్క్‌ఫోర్స్ వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే వరప్రసాదరావు, డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డిలతో కలసి మంగళవారం నిర్వహించి తగు సూచనలిచ్చారు.



ఓజిలి మండలం మానమాల గ్రామంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు సందర్భంగా ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉచ్చూరు శోభారాణి, సీనియర్ నాయకుడు ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, పొదుపు మహిళలు

# పోలీసులు మనోధైర్యంతో ఉండాలి

**డిఎస్పీ రాజగోపాలరెడ్డి**



పోలీసులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని గూడూరు డిఎస్పీ రాజగోపాలరెడ్డి తెలిపారు. పట్టణంలోని సిఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో ఈ నెల 15వ తేదీ పోలీసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని సి.ఐలు, ఎస్సైలు, పోలీసులు, వైద్యులు పాల్గొన్నారు.

# పితృ పక్షంలో విప్ర పూజ



ఈనెల 13వతేదీ అమెరికా బ్రాహ్మణ సేవ సంస్థవారి ఆర్థిక సహకారంతో నగరంలోని ప్రముఖ కవిపండితోపన్యాసకులు ఆలూరు శిరోమణి శర్మ నివాసంలో బ్రాహ్మణ పూజ జరిగింది. ఆర్థికంగా వెనుకబడిన 25మంది బ్రాహ్మణులను ఆహ్వానించి వారిని శాలువాలతో సత్కరించి, ప్రతి ఒక్కరికి రూ.201 నగదు, 8కేజీల బియ్యంతో పాటు 23 వస్తువులు, ఒక పితృ కార్యానికి సరిపడే నల్ల నువ్వుల తోటి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా స్వస్తి వచనాలతో వేద ఆశీస్సులతో ప్రపంచ శాంతిని కోరుతూ కరోనా మహమ్మారి సమూలంగా నిర్మూలం కావాలని బ్రాహ్మణులు సంకల్పించారు. ఆరు గ్రహాలు స్వక్షేత్రాలలో ఉన్న అరుదైన పర్వదినం రోజున ఈ కార్యక్రమంలో జరపడం విశేషం. పొంగూరు శివకుమార్‌శర్మ, మధుర భారతం సీతారామయ్య, ఫణికృష్ణ శర్మ, గండవరం శీనయ్య పాల్గొన్నారు.

# సుమధుర భావనల సమాహారం.. శివగామిని





నవ్య ప్రబంధ ఛాయలతో, స్వప్న ప్రవృత్తమైన ఇతివృత్తంతో, సుమధురమైన భావనలతో కొత్త పాతల మేలుకలయికే లక్ష్యంగా 'శివగామిని' కావ్యాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త మెట్టు రామచంద్ర ప్రసాద్ ఒకే పట్టుతో రచించారు. ఈ కవికి సామాజిక స్పృహ, కవితా సౌందర్య దృష్టి, భాష మీద పట్టు అధికమనే చెప్పాలి. ఈయనది అనవసరపు అభిజాత్యం లేని వ్యక్తిత్వం. మృదుమధురంగా మాట్లాడే నైజం. అపారమైన స్నేహవాత్సల్యంతో సాగించే సాధు భాషణం. అన్నింటిని మించిన విశాలభావ మనస్కుడు. కావ్యరచనలో పూర్వకవుల బాటన నడిచినా నవ నవోన్మేషమైన ఆధునికభావాలను చొప్పించి నేటి కవులను సైతం ఒప్పించిన నైపుణ్యం వీరిది. పూర్వ ప్రబంధాలలోని చంపూ విధానాన్ని త్రోసిపుచ్చి కావ్యాన్ని పూర్తిగా పద్యంతో పరిసమాప్తం గావించిన దిట్ట.. మెట్టు వారు.

కావ్యంలో 'శివగామిని' సుందర మనోహర మంగళ రూపాన్ని దర్శింపజేస్తూ వివిధ ఛందో రీతుల్లో అలవోకగా ఆవిష్కరించిన ప్రతిభ వీరిది. మూడు రాత్రుల కథను ముచ్చటగా తీర్చిదిద్ది, తేనె చక్కెరల తీయదనాన్ని పాఠకులకు రుచి చూపించిన పండిత కవి ఈయన.

ఈ వ్యాఖ్యాన సహితమైన 'శివగామిని' కావ్యాన్ని రాజ్యసభ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారికి అంకితమి చ్చారు. ప్రభాకరరెడ్డి దీనజన బాంధవుడు, సహృద యుడు, సాహిత్యప్రియుడు కూడా. శివగామిని కావ్యానికి ఆశీస్సులందించిన పింగళి లక్ష్మీకాంతము, కావ్యప్రశంస గావించిన దీపాల పిచ్చయ్యశాస్త్రి, కవితాగానము శీర్షికతో భావప్రకటన చేసిన మోపూరు వేణుగోపాలయ్య గొప్పకవులు, పండితులు, విమర్శకులు. రాగసుధలు కురిపించే పద్యాల్లోని రసజ్ఞతను వెల్లడించడంలో వీరు కృతకృత్యులయ్యారు.

'శివగామిని' కావ్యంలో.. తొలిరాత్రి... కథానాయికలో శివుని ఆరాధించి విఫలమైన నిస్పృహ కనిపిస్తుంది. మలిరాత్రి కలలో శివునితో వాగ్వాదములాడిన ధీర కనిపిస్తుంది. మూడోరాత్రి వివాహానంతరము కలలో శివ సాక్షాత్కారమునొందిన భక్తురాలు కనిపిస్తుంది. ఈ కావ్య రచన భావ కవిత్వము, భక్తిభావ కవిత్వమూ






కవి - వ్యాఖ్యాత :
మెట్టు రామచంద్రప్రసాద్
వెల : రూ.150/-

ప్రతులకు:
పద్యకళా పరిషత్
4వ అడ్డవీధి, నేతాజీ నగర్, నెల్లూరు - 4.
సెల్. 9346323609, 93903 02559.
శ్రీ సత్యానందాశ్రమము, ఇనమడుగు, కోవూరు.

పెనవేసుకుని సాగిన వైనాన్ని వ్యక్తీకరిస్తూ డా.సూరం శ్రీనివాసులు మెట్టువారి శైలిని నిరాడంబరమైనదిగాను, నిర్దుష్టమైనదిగాను, ఎచ్చులకు పోని భావనాబలంతో అలరారుతోందని అభిప్రాయపడ్డారు.

'శివగామిని' కావ్యాన్ని ప్రపత్తి, స్వప్నము, వివాహము, సాక్షాత్కారము అనే నాలుగు విభాగాలుగా విభజించి రాశారు. ప్రపత్తిలో శివుడు కామవిరోధి కావుననే భయముతో ఏమరుపాటు లేక శివగామిని కొల్చినది. తన రూపయౌవన పావన ముగ్ధ కళా సంపదలను అన్నింటిని సమర్పించి ఆరాధించినది. కావుననే ఆమె పూజ మేలగురీతి నుండినది. అదియే ప్రపత్తియైనది..అంటాడు కవి. శివగామిని 'ధనికుల ఇంట బుట్టి తన తల్లియు దండ్రియు నొక్క కూతురంచనవరతంబు నేమరక యచ్చికబుచ్చిక తోడ బెంచినన్' శివుని పొందు కోరుచు శివగామిని శంకరునే స్మరించుచుండెడిది. ఆమె తల్లిదండ్రులు ఈ తంతు చూచి ఏ విధంగా మదనపడేది చెప్తూ 'సౌమ్య శివభక్తి బరికించి సంతసించు గాని గాఢమౌ నా భక్తి గాంచి జనకు / దదిరిపడి పరమేశునం దట్టిభక్తి / తగదు సుత కని యెంతయు వగచుచుండె'.. అంటారు. చివరకు ఆమెకు కనువిప్పు కలుగుతుంది. గుండె లేని బండగా ఆమె శివుని భావించి 'దేహమొక్కటి మాత్రమే తిరిగి రాగ/ వదలివచ్చినది గుడిని హృదయమామె/గుండెలేని బండశిలకు గుండెనిచ్చి/మనిసినిగ జేయుటకు నేమొ యనెడు రీతి'..లో శివగామిని విరహమునకు పరాకాష్టగా పేర్కొంటోంది. 'స్వప్నము'లో దాస్యభక్తిని చూపుతూ శివగామిని 'దోసమేమి చేసినానొ తోచదాయె నమ్మరో/ నన్ను జూచి కూడనౌర/ నా సఖుండు మూగయౌ/బాస రాని యట్లు తండు పలుకుమన్న బలుకదే–దాసిపైన గోపమేల తన కదేమి ఘనతయా!'.. అంటూ వేష్ట పోతుంది నాయకి. 'వివాహము'లో భక్తి శృంగార భావ సంభరిత గాన/వలపులో భక్తి జిలుకుచు వరదు గొలువ–మున్ను చనురీతి గుడికేగి యున్నదేమొ/యనుచు బలుతెరగుల నెంచి రచటివారు'..అంటూ శివుని మీద భక్తిచేత ఆమె ప్రవర్తించిన తీరు వర్ణిస్తాడు కవి. 'సాక్షాత్కారము'లో చివరిపద్యంగా శివసాక్షాత్కారాన్ని చెప్తూ 'అంధకారావృత పరిధి నలమటించి/యిన్ని దినములు వనరితి నిందుభూష/జ్ఞానచంద్రికా ప్రభలచే నాదు హృదయ/తిమిర పటలము సమసెను దీప్తి రూప'.. అంటారు. చివరకు శివగామిని సుజ్ఞానంతో భక్తి మార్గంతో శివుని చేరిన విధము ఎంతో హృదయ రంజకంగా రచించారు మెట్టు వారు.

అద్భుతమైన అభివ్యక్తితో కావ్య రచన గావించిన మెట్టు రామచంద్రప్రసాద్ అభినందనీయుడు. వారికి నా అభినందనలు. ఈ కావ్యం చివర వారు రాసిన సుదీర్ఘ దండకమునకు దండాలు పెడుతూ ముగిస్తున్నాను.



**సమీక్షకులు: కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి**
కవి, విమర్శకుడు - కనిగిరి. సెల్: 9948774243.

# చరమం



**ఏటూరి నాగేంద్రరావు**
7416665323

ప్రతిచోటా మరణంలాంటి నిశ్శబ్దం.
శకలాలుగా విడిపోతున్న
మానవసంబంధాలు
కొన్ని జీవితచరిత్రల్ని పాడుతున్నట్టుంది.
కొన్ని జ్ఞాపకాలు ... కొన్ని భయాలు.
జీవితం ఎరుకేంటో అర్థం కావడం లేదు.
కలల్ని పోగొట్టుకొన్న భూమిలా
జ్ఞాపకాలు అదృశ్యమౌతున్నాయ్ !
నా కన్నుల్లో మినుకు మినుకుమనే
రమారమి దృశ్యాలను బజ్జోపెట్టడానికి
నేనింకా జీవితం నుంచి తేరుకోవాలి.
కాలం ఎన్ని మరణాల్ని కలగనిందో
అయినా తోసుకుంటూ
నడచి వెళుతూనేవుంది.
విషాద మానవగాథ
నగ్నంగా రొట్టెను రెండోవైపు
కాలుస్తూ తృప్తిపడుతోంది.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# బిజెపి రాష్ట్ర కార్యవర్గంలో ఆ నలుగురు

## - రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పి.సురేంద్రరెడ్డి





ఆంజనేయరెడ్డి



విజయలక్ష్మి



కమల

బిజెపి రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన నలుగురు నాయకులకు పదవులు దక్కాయి. పార్టీకి సేవలందిస్తున్న నాయకులను గుర్తించి రాష్ట్ర నాయకులు తాజాగా ఈ పదవులకు పలువురు సీనియర్లను ఎంపిక చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఈనెల 13న భారతీయ జనతాపార్టీ రాష్ట్ర నూతన కార్యవర్గం ప్రకటించగా, అందులో జిల్లాకు చెందిన పి.సురేంద్రరెడ్డిని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించారు. గతంలో బిజెపి జిల్లా అధ్యక్షుడిగా పి.సురేంద్రరెడ్డి సుదీర్ఘకాలం పనిచేసి పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషిచేసినందుకు ఆయనకు ఈ ఉన్నత స్థానం లభించింది. అదేవిధంగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా కర్నాటి ఆంజనేయరెడ్డిని ఎంపికచేశారు. గతంలో ఆత్మకూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కూడా పోటీచేసిన రాజకీయ అనుభవం ఉన్నవారు కావడం, ఎంతోకాలంగా పార్టీకి సేవచేస్తూ సీనియర్ నాయకునిగా ఉండడంతో కర్నాటిని ఈ పదవికి ఎంపిక చేసినట్లు సమాచారం. వీరితో పాటు మహిళా నాయకురాలు కాకు విజయలక్ష్మిని రాష్ట్ర మహిళావిభాగం ఉపాధ్యక్షురాలిగా, కావలి పట్టణానికి చెందిన కమలను రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో స్థానిక బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వరద నీటి ప్రవాహంతో జాగ్రత్త

- పెన్నా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- హెచ్చరించిన నీటిపారుదల అధికారులు

జిల్లాలోని సంగం బ్యారేజీ వద్ద జరుగుతున్న నిర్మాణపు పనులను ఈనెల 14న తెలుగుగంగ ఎస్ఇ హరినారాయణరెడ్డి, సోమశిల డ్యామ్ ఎస్ఇ కృష్ణారావు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎడమ వైపు ఉన్న పొర్లుకట్ట రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వర్షాల ధాటికి పెన్నానదికి వరద తాకిడి ఉండవచ్చని భావిస్తున్న నేపథ్యంలో మట్టికోతకు గురికాకుండా బ్యారేజీ పనుల వద్ద కట్టుదిట్టమైన రీతిలో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎగువతట్టు ప్రాంతాల్లో వర్షాలతో పాటు కృష్ణానది జలాలు రావడంతో సోమశిల జలాశయంలో అంతకంతకు నీటిమట్టం పెరుగుతుండడంతో ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని గమనిస్తున్నారు. కండలేరు జలాశయానికి కూడా నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

### కొండ బిట్రగుంట ప్రసన్నుడికి

# త్వరలో కొత్త రథం

**- ఆలయ కమిటీ ఛైర్మెన్ శ్రీరాం మాల్యాద్రి**

బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన రథం సుమారు ఏడాది క్రితం ప్రమాదవశాత్తూ కాలిపోయిన విషయం అందరికీ తెలిసిందే. దీంతో ఆలయ కమిటీవారు కొత్త రథం నిర్మాణానికి సంకల్పించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చొరవతో స్వామివారికి నూతన రథం నిర్మాణానికి ప్రభుత్వం 87 లక్షల రూపాయలు మంజూరు చేసిందని ఆలయ కమిటీ ఛైర్మెన్ శ్రీరాం మాల్యాద్రి చెప్పారు.

ఈనెల 13న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ త్వరలోనే నిర్మాణపు పనులు ప్రారంభమవుతాయని, కరోనా నేపథ్యంలో అలస్యమవుతోందని అన్నారు. టిటిడిలో మాదిరిగానే ఇక్కడ కూడా రథాన్ని తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే ప్రతాప్ కృషి చేస్తున్నారని, ఇక్కడ ఆర్చీ ఏర్పాటుకు నిధులు సమకూర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 5 జిల్లాల నిరుద్యోగులకు

# శ్రీసిటీలో నైపుణ్య శిక్షణ

## - ఎం.డి రవీంద్ర సన్నారెడ్డితో చర్చించిన అధికారులు



నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉద్యోగాల కల్పనపై రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీనియర్ మేనేజర్ (రిక్రూట్‌మెంట్) శ్రీనివాసులురెడ్డి నెల్లూరుజిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయూమ్ ఈనెల14న శ్రీసిటీ అధికారులతో చర్చలు జరిపారు. ప్రముఖ పారిశ్రామికవాడ శ్రీసిటీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో రాష్ట్రంలోని 5 జిల్లాలకు చెందిన 30 మందిని ఎంపిక చేసి వారికి వెల్డింగ్ ట్రేడ్‌లో శ్రీసిటీలోని సీమెన్స్ టెక్నికల్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. 6 నుంచి 8 వారాల శిక్షణ అనంతరం వారికి శ్రీసిటీలోని ప్రముఖ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించే అవకాశాలపై చర్చించారు. ఈ అంశాలన్నిటినీ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి అధికారులు వివరించగా, నైపుణ్యశిక్షణ, ఉపాధి కల్పన విషయాలపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు.

### రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కమిటీలో రవీంద్ర సన్నారెడ్డికి సభ్యత్వం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కమిటీలో సభ్యత్వం పొందడం తనకెంతో సంతోషంగా ఉందని, ఇదెంతో గౌరవప్రదమైన బాధ్యతగా తాను భావిస్తున్నానని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ఈనెల 12న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కమిటీ సభ్యునిగా తనను ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డికి ఆయన ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) విశ్వవిద్యాలయం, కళాశాలల్లో శిక్షణను ఇచ్చేందుకు అవసరమయ్యే విధివిధానాలు, కోర్సులు, మౌలిక సదుపాయాల కల్పనకు నైపుణ్యాభివృద్ధి సంస్థ అవసరమైన అమూల్యమైన సూచనలను అందిస్తుందని, తానొక సభ్యునిగా తనవంతు బాధ్యతలు నిర్వహిస్తానన్నారు.

### ఆంధ్రా శబరిమలగా ప్రఖ్యాతి గాంచిన

# తుమ్మగుంట.. శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం







## మన దేవాలయాలు (13)

***జిల్లాలోని విడవలూరు మండలం తుమ్మగుంట గ్రామంలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం ఆంధ్రా శబరిమలగా ప్రఖ్యాతి గాంచింది. హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి 'వృక్ష రూపం'లో వెలసిన ఈ ప్రాంతం ఎంతో మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధి. అయ్యప్ప భక్తులకు కొంగుబంగారంగా, అపర శబరిమలగా వెలసిన ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది.***

యోగభూమి, దివ్యభూమి అయిన మనదేశం దేవతలకే కాదు.. దేవతా వృక్షాలకు కూడా ఎంతో ప్రసిద్ధి. రావి, జువ్వి, మారేడు, వేప చెట్ల వంటివి నిత్యం అనేకప్రాంతాల్లో భక్తుల పూజలు అందుకుంటూనే ఉన్నాయి. అలాంటి పరమ పవిత్రమైన వృక్షమైన జువ్విచెట్టు రూపంలో అయ్యప్పస్వామి తుమ్మగుంట గ్రామంలో వెలసి ఉండడం అపురూపం. ఆంధ్రదేశంలో వృక్షరూపంలో వెలసిన అయ్యప్పస్వామి నిత్యపూజలందుకుంటున్న ఈ కోవెల మన జిల్లాలో ఉండడం ఎంతైనా విశేషం. స్థానికుల కథనాలను బట్టి ఆలయ చరిత్రకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

**ఆలయ చరిత్ర :**

దాదాపు నాలుగువందల సంవత్సరాల క్రితం మహాచక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు తన పర్యటనలో భాగంగా తుమ్మగుంట గ్రామానికి వచ్చారని, అప్పట్లో రాయలవారితో కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన పుదూరు ద్రావిడులు ఎంతో ప్రశాంతమైన ఈ ప్రాంతంలో తాము స్థిరపడతామని చెప్పడంతో రాయలవారు అందుకు సమ్మతించి ఈ గ్రామాన్ని వారికి అగ్రహారంగా బహుకరించాడని చెప్తుంటారు. నాటి నుంచి వారు ఇక్కడే స్థిరపడడంతో తుమ్మగుంట ద్రావిడులుగా వారికి పేరువచ్చిందని అంటారు. ఆ వైష్ణవ బ్రాహ్మణుల ఆరాధ్యదైవం అయ్యప్పస్వామి కావడంతో గ్రామ నిర్మాణం చేసే సందర్భంలో తమ ఆరాధ్యదైవమైన అయ్యప్పస్వామి ఆలయాన్ని ఏర్పాటుచేసి అందులో జువ్వి చెట్టు కింద స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేయడం ప్రారంభించి 'వృక్ష అయ్యప్ప'గా కొలవడం ప్రారంభించారు. రాష్ట్రంలో అయ్యప్పస్వామికి ఇదే తొలి ఆలయం కావడంతో రాష్ట్రంలో ఆ కాలం నుంచే అయ్యప్పస్వామి ఆరాధన ప్రారంభమైందని ప్రతీతి. ఈ ఆలయ ప్రాంగణంలోనే ఎంతో విశిష్టమైన, కాశీ నుంచి తీసుకువచ్చిన అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహాలను కూడా ప్రతిష్టించి ఎంతోకాలంగా భక్తులు ఇక్కడ పూజలు చేస్తున్నారు. మరోవైపు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామిని కూడా తెచ్చి ప్రతిష్టించారు. దీంతో హరిహరుల మధ్య అయ్యప్పస్వామి కొలువై ఉన్న మహిమాన్వితమైన క్షేత్రంగా తుమ్మగుంట అయ్యప్పస్వామి దేవాలయం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో ప్రాచీనకాలం నుంచి నాగదేవత విగ్రహంతో పాటు గుడి కూడా ఉండడం ఎంతో అరుదైన విషయం. ఆ తర్వాత ఇటీవలి కాలంలో.. అంటే 1979 ప్రాంతంలో ఈ ఆలయం జీర్ణోద్ధరణ జరిగింది. అప్పట్లో కంచిస్వామి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీస్సులతో, తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో పాటు ఎంతోమంది భక్తుల చేయూతతో ఆలయం ఎంతగానో అభివృద్ధి చెందింది. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి గుడులతో పాటు ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహ ప్రతిష్ట జరగడంతో ఆలయం ఆయా దేవతామూర్తుల దివ్యాశీస్సులతో నేటికీ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఎంతో విశిష్టమైన రీతిలో ఇక్కడ సర్వాంగసుందరంగా ముఖమండపాలు, ఆలయ ముఖద్వారం, జ్యోతిమండపం, కల్యాణమండపాలు ఏర్పడ్డాయి.

**వైభవంగా కార్తీక పూజలు :**

ఈ ఆలయంలో కార్తీకమాసంలో విశేష పూజలు జరుగుతుంటాయి. లక్ష తులసిపూజ, కృత్తికా దీప మహోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివస్తుంటారు. ఏటా జనవరిలో మకర సంక్రాంతి రోజున మకర జ్యోతి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. మాలధారణతో వేలాదిమంది అయ్యప్ప భక్తులు ఇక్కడికొచ్చి స్వామివారిని దర్శించుకుని తరిస్తుంటారు. పర్వదినాల్లో, ఉత్సవాల రోజుల్లో అయ్యప్పస్వామికి మరెంతో భక్తిశ్రద్ధలతో పూజలు, సేవలు జరుగుతుంటాయి. కార్తీకమాసం నుంచి శబరిమల దీక్షలు, ఇరుముడి పూజలతో పాటు అయ్యప్పస్వామి భజనలతో ఆలయం కళకళలాడుతుంటుంది. ఏటా జరిగే నవరాత్రి ఉత్సవాలు ఎంతో శోభాయమానంగా ఉంటాయి. ఈ ఆలయాన్ని సందర్శించి అయ్యప్పస్వామిని భక్తితో దర్శించు కున్న భక్తులకు సకల శుభాలు కలుగుతాయని, కోరిన కోరికలు నెరవేరుతాయని వేరే చెప్పనక్కరలేదు.

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com
Please note the change

# స్టేలతో కలకలం..

# పార్టీలలో కలవరం...

*"రాజధాని భూ కుంభకోణాలపై తొందరపాటు చర్యలు వద్దు"*

*"మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులను పక్కన పెట్టండి"*

*"గత ప్రభుత్వ అవినీతి నిగ్గు తేల్చడానికి ఏర్పాటుచేసిన "సిట్" (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) కార్యకలాపాలు నిలిపేయండి"...*



ఇవీ... గత రెండు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైకోర్టు ఇచ్చిన స్టేలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. గతంలో కూడా అనేక కేసులలో ప్రభుత్వానికి చుక్కెదురవ్వుయ్యేలాగానే హైకోర్టు తమ తీర్పుల తోను, స్టేలతోనూ ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తూనే వుండడం పార్టీ వర్గాల్లో కలకలంగా ఉంది. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో రాజధాని పేరుతో జరిగిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ భాగోతాన్ని బయటపెట్టి తెలుగుతమ్ముళ్ళ ముసుగు తొలగించాలన్నది జగన్ ప్రభుత్వ ఆలోచన. అయితే దర్యాప్తు అంతా పూర్తయ్యి కొంతమంది కీలక వ్యక్తుల పేర్లతో నమోదైన ఎఫ్ఐఆర్‌కి సంబంధించిన చర్యలు తీసుకోకూడదు సరికదా, ఆ వివరాలు కూడా బయట వెల్లడించరాదని, ప్రచార మాధ్యమాల్లో ఎక్కడా రాకూడదని హైకోర్టు హుకుం జారీ చేయడం సంచలనం కలిగించింది. 4వారాల పాటు ఈ దర్యాప్తుని వాయిదా వెయ్యాలని స్టే ఇచ్చింది.

ఇక గత ప్రభుత్వ హయాంలో అన్ని శాఖలలో జరిగిన అవినీతిని, అనాలోచితంగా చేసిన నిర్ణయాలను బట్టబయలు చెయ్యడానికి సైతం మంత్రిమండలి సభ్యులతో కూడిన ఉపసంఘం, ఆ ఉపసంఘం నేతృత్వంలో ఏర్పడిన 'సిట్' చేస్తున్న కార్యకలాపాలనన్నిటినీ కూడా ఆపేయాలంటూ హైకోర్టు స్టే విధించింది. ఒక్కసారిగా అన్ని దర్యాప్తులను ఆపేయండి అంటూ వచ్చిన స్టేలు మేధావి వర్గాల్లో కలకలం రేపితే, ఊహించని ఈ పరిణామంతో ఒక్క తెలుదేశంపార్టీ తప్ప వైసిపి సహా మిగిలిన అన్ని రాజకీయపార్టీలు కలవరపాటుతో ఉలిక్కిపడ్డాయి. ఈ స్టేలపై వైసిపి నేతలు తీవ్రంగానే స్పందించారు, దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జరుగుతున్న ఈ పరిణామాలు భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెరలేపాయన్నది మేధావుల అభిప్రాయం. ఈ పరిణామాలు ఎక్కడికి దారితీయనున్నాయో వేచి చూడాల్సిందే..!

# రాజకీయ యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఈ జాడ్యం గ్రామస్థాయికి కూడా విస్తరించింది. సెల్‌ఫోన్ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం అరచేతిలోకి రావడంతో నేటి సమాజం వింత పోకడలకు అలవాటు పడిపోయింది. వేలం వెర్రిగా ఒకరిని మించి మరొకరు విమర్శనాత్మక పోస్టింగులలో పోటీపడుతూ విలువలకు వలువలు విడిచేస్తున్నారు.

శృంగార వీడియోలతో యువతను చెడుదారిపట్టిస్తున్న వెబ్‌సైట్లతో రోజు రోజుకి తల్లితండ్రులలో ఆందోళన ఓ వైపు పెరుగుతుంటే, మరో వైపు అంతకంటే జుగుప్స కలిగించే స్థాయిలో రాజకీయ వానరమూక చేస్తున్న సామాజిక రాజకీయ యుద్ధం అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. అన్ని రాజకీయపార్టీల నాయకులు కూడా ఈ చర్యలను ఎక్కడా ఖండించక పోగా తమకు వచ్చిన మెసేజీలను వెంటనే ఫార్వర్డ్ చేసి ఆనందిస్తున్నారు. ఎక్కడో ఒకటో, అరో పోలీసులు కేసులు పెట్టి ఈ పోకడను నియంత్రించే ప్రయత్నం జరుగుతుంది తప్ప.. ఈ సంప్రదాయానికి అడ్డుకట్ట వేసే చట్టాలకు రూపకల్పన జరగడంలేదు.

సామాజిక మాధ్యమాలలో అత్యంత ప్రాచుర్యం పొందిన ప్లాట్‌ఫామ్ ఫేస్‌బుక్. ఇక్కడ ఏదైనా పోస్టింగ్ పెడితే క్షణాల్లో కొన్ని లక్షలమంది చూస్తారు. ఇటీవల ఒక అంతర్జాతీయ సంస్థ నిర్వహించిన సర్వేలో ఫేస్‌బుక్‌ని నెలకి 2.23బిలియన్ల మంది వీక్షిస్తారని అంచనా వేశారు. అదేవిధంగా యుట్యూబ్‌ని 1.9బిలియన్లు, వాట్సఆప్‌ను 1.5బిలియన్లు, మెసెంజర్‌ని 1.3బిలియన్లు, విచాట్‌ని 1.06బిలియన్లు, ఇన్‌స్టాగ్రామ్‌ని ఒక్క మిలియన్ మంది, ట్విట్టర్ను 335 మిలియన్ల మంది నెలకు వీక్షిస్తారని తేలింది. ఇవి కాకుండా ఇంకా క్యాక్యూ, టంబ్లర్, క్యూ జోన్, లింక్‌డెన్, వైబర్, టెలిగ్రామ్‌లతోపాటు ఇంకా అనేక ప్లాట్‌ఫారాలు అంతర్జాలంలో అందుబాటులో వున్నాయి.

**భవిష్యత్తు వీటిదే...**

ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాల కంటే శరవేగంగా సమాచారాన్ని అందించగలిగిన వేదిక సోషల్ మీడియా. భవిష్యత్తులో సమాజం ఈ మాధ్యమం పైనే పూర్తిగా ఆధారపడే పరిస్థితి వస్తుంది. ఇలాంటి తరుణంలో ఇలా వ్యక్తిగత నిందలకు, స్వార్థ ప్రయోజనాలకు ఈ మాధ్యమాన్ని వాడుకోవడం శోచనీయం. సంచలనం కోసమో, తమ నాయకుడి మెప్పు కోసమో చేసే కొన్ని వికృత చేష్టల వల్ల కొన్ని కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా కొంతమంది దుర్మార్గులు చేస్తున్న అబద్ధపు ప్రచారాలవల్ల కొన్ని సందర్భాలలో నిజాలు సైతం మరుగున పడిపోయే ప్రమాదం వుంది.

ఒక పార్టీ కార్యకర్త మరోపార్టీ నాయకుడిని నీచాతి నీచంగా వర్ణిస్తూ పోస్టింగును పెడితే రెండవ పార్టీ కార్యకర్త మొదటి పార్టీ నాయకుడితో పాటు అతని కుటుంబ సభ్యులను సైతం బజారుకీడుస్తూ పోస్టింగు పెడతాడు. తన నాయకుడిమీద పెట్టిన పోస్టింగ్ కంటే తనది ఒక మెట్టు ఎక్కువగా వుండాలని ఆలోచిస్తాడు కాబట్టి విచక్షణ కోల్పోయి ఉన్నవీ లేనివీ కలిపి మొత్తం కుటుంబాన్ని రచ్చ కీడుస్తాడు. ఒకసారి ఇలాంటి పోస్టింగ్ బయటకు వచ్చిందంటే ఇక దానిని ఆపడం ఎవరి తరమూ కాదు, క్షణాల్లో అది లక్షలమందికి చేరిపోతుంది. "ఎవరి గురించైనా మంచి చెప్తే అది పది మందికీ తెలియడానికి చాలా సమయం పడుతుంది, అదే చెడయితే క్షణాల్లో విస్తరించి వేలాదిమందికి తెలిసిపోతుంది" అని... ఒక సీనియర్ పాత్రికేయుడు ఎప్పుడూ చెప్తూ ఉండేవారు. ఇప్పుడు అక్షరాలా అదే జరుగుతోంది, చెడు వాయువేగంతో జనంలోకి వెళ్తుంది, వచ్చే వార్తలో నిజమున్నా లేకపోయినా ముందుగా విషయం బుర్రలోకి వెళ్లి పైశాచిక ఆనందాన్ని కలిగిస్తోంది.

ఈ పరంపర ఆగాలంటే ముందుగా సాటి మానవుడి మైండ్‌సెట్ మారాలి, వచ్చిన విషయంలో వాస్తవమెంతో తెలుసుకోకుండా దాన్ని పదిమందికి పంపించే అలవాటు మానుకోవాలి. భవిష్యత్తులో సమాచార వ్యవస్థలో అగ్రస్థానం సామాజిక మాధ్యమాలదే. నిబద్ధతతోకూడిన వార్తలకు, విశ్వసనీయత కలిగిన సమాచారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అబద్ధపు విషయాలతో, అవాస్తవ కల్పితాలతో సమాచారాన్ని అందించేవారిని, వ్యక్తిగత దూషణలతో వ్యక్తిత్వాన్ని కించపరిచే వారిని నియంత్రించేలా కఠిన చట్టాలు రావాలి. సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేసే మన భారతదేశంలో ఇలాంటి సామాజిక అరాచకాలకు అవకాశం ఇవ్వకూడదు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే రాజకీయ యుద్ధం హద్దు మీరకూడదు.

# తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు మరణవార్త అందరినీ కలచివేస్తోంది. కరోనా సోకడంతో గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యానికి లోనై చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఇటీవలే కరోనా నుంచి నెమ్మదిగా కోలుకున్న ఆయన గుండెపోటుతో మృత్యువాత పడడం బాధాకరం. ఈనెల 16వతేది బుధవారం సాయంత్రం ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సరళమ్మ, కుమారులు కళ్యాణ్, కార్తీక్, కుమార్తె డాక్టర్ హరిత ఉన్నారు. బల్లి దుర్గాప్రసాద్ మరణంతో గూడూరు, వెంకటగిరిలతో పాటు జిల్లా అంతటా విషాదఛాయలు అలముకున్నాయి.

**వివాద రహితుడు..**

బల్లి దుర్గాప్రసాద్‌రావు... గూడూరు ప్రజల నాయకునిగా ఎంతోకాలం నుంచి సుప్రసిద్ధులు. గూడూరు శాసనసభ్యునిగా నాలుగుసార్లు పనిచేసిన ఏకైక నేత ఆయనే. ఎప్పుడూ ప్రజల్లో తిరుగుతూ, ప్రజలతో కలసి అనేక కార్యక్రమాల్లో అనునిత్యం పాల్గొంటూ అందరికీ స్నేహపాత్రునిగా



ఉంటున్న ఒక మంచి నేతగా ఆయన అందరికీ సుపరిచితులు. గ్రామగ్రామాన ఎందరితోనో ఆయనకు పేర్లుపెట్టి పిలిచేంతటి సాన్నిహిత్యం ఉండేది. స్వస్థలం వెంకటగిరి అయినప్పటికీ రాజకీయప్రస్థానమంతా గూడూరులోనే కావడం విశేషం. రాజకీయరంగంలో వివాదాల జోలికిపోని..మచ్చలేని నేత ఆయన. అజాతశత్రువుగా ఉంటూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతూ..ఆ తర్వాత జిల్లా ప్రజల్లోనూ, రాష్ట్రవ్యాప్తంగానూ అందరి మన్ననలు అందుకున్నారు.

**నెల్లూరులో బి.ఏ., ఎల్ఎల్‌బి**

నెల్లూరు విఆర్ లా కళాశాలలో బిఏ ఎల్ఎల్‌బి పూర్తిచేసి న్యాయశాస్త్రంలో పట్టభద్రులై వెంకటగిరిలో న్యాయవాదిగా జీవితం ప్రారంభించిన ఆయన... ఆ తర్వాత న్యాయమూర్తిగా ఉత్తీర్ణులై పోస్టింగ్ వచ్చినా, వెళ్ళక రాజకీయరంగం వైపు ఆకర్షితులై గూడూరుతో అనుబంధం పెంచుకున్నారు. దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి అనుచరునిగా రాజకీయాల్లోకి వచ్చి అంచెలంచెలుగా ఎదిగారు. 1981లో సమితి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినా ఆయనకు ప్రజాసేవపై ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు.

**ఎమ్మెల్యేగా.. మంత్రిగా..**

**ఎంపీగా పదవులు :**

1985 ఎన్నికల్లో బల్లి దుర్గాప్రసాద్ రావు టిడిపి ఎమ్మెల్యేగా పోటీచేసి 22,224 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆ తర్వాత 1989 ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయినా, మళ్ళీ 1994లో గూడూరు నుంచే 28,350 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఆ తర్వాత 1986–98లో రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా కూడా పదవీ బాధ్యతలు చేపట్టారు. 1999లోనూ గూడూరు నుంచి పోటీచేసి 9,770 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2004లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిడిపి టికెట్ ఇవ్వకుండా నిరాకరించినప్పటికీ పార్టీలోనే కొనసాగారాయన. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో పోటీచేసి 10,638 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. 2014లో టిడిపి మళ్ళీ టికెట్ నిరాకరించినా మౌనంగానే ఉండిపోయి ఆ తర్వాత 2019 ఎన్నికల్లో వైకాపా తరఫున తిరుపతి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసి కనీవినీ ఎరుగని విధంగా 2లక్షల26వేల61 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించి రికార్డు సృష్టించారు. వైకాపాలో చేరిన పక్కరోజే ఆయన తిరుపతి ఎంపి అభ్యర్థయ్యాడు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభంజనంలో అత్యంత సులువుగా ఎంపీగా అఖండ విజయం సాధించారు. ఇంత భారీ మెజార్టీతో బల్లి దుర్గాప్రసాద్ రావు గెలవడం జిల్లాలోనే కాక, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది కూడా!

**ప్రజా సంక్షేమమే ఊపిరిగా...**

ఏ పదవిలో ఉన్నా ఆయన ధ్యాసంతా ప్రజాసమస్యల పరిష్కారం మీదనే! అలాంటి ఒక మంచినేత లేని లోటు ఏనాటికీ తీరనిది. దుర్గాప్రసాద్‌రావు మృతికి చింతిస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతోంది 'లాయర్'.

# డాక్టర్ ముఖర్జీ హఠాన్మరణం



నెల్లూరు పెద్దాసుపత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ముఖర్జీ ఈనెల15వ తేది రాత్రి కరోనాతో హఠాన్మరణం పొందారు. ఆయన మరణంతో జిల్లా ఒక నిపుణుడైన వైద్యుడిని కోల్పోయి నట్లయింది. అనేకమంది వైద్యులు, వైద్య సిబ్బంది, యూనియన్‌ల నాయకులు ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ నివాళులర్పించారు. ఈనెల 16న నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నిర్వహించిన ఈ సంతాపసభలో వక్తలు డాక్టర్ ముఖర్జీ సేవలను ఎంతగానో కొనియాడారు. 60 ఏళ్ళ వయసులోనూ డాక్టర్ ముఖర్జీ కోవిడ్ బాధితులకు ఎంతో దీక్షతో వైద్యసేవలందించారని, ఆయన సేవలు విస్మరించలేనివని యూనియన్ గౌరవాధ్యక్షుడు ప్రస్తుతించారు. ఎంతోమంది నిరుపేదలకు ఆయన వైద్య సాయం అందించారు. ఎల్లవేళలా చెరగని చిరునవ్వుతో ఉంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించేవారని, వైద్య రంగంలో ఎంతోమందికి స్నేహపాత్రుడైన డాక్టర్ ముఖర్జీ మరణం తమకెంతో బాధాకరమని వక్తలు విచారం ప్రకటించారు. ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కాలేషాబాబా, యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ నాయకులతో పాటు పలువురు వైద్యులు సంతాపం ప్రకటించారు. యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శేషయ్య, సంధానీబాషా, శ్రీనివాసులు, నాయకులు ఉస్మాన్, సురేష్‌బాబు, జబ్బార్, భాస్కర్, అహ్మద్‌బాషా పాల్గొని ఆయన మృతికి విచారం ప్రకటిస్తూ నివాళులర్పించారు.

Please note the change

www.lawyerteluguweekly.com is now www.lawyerpatrika.com

### విద్య - వైద్యం కోసం

# కోటి రూపాయలిచ్చిన మస్తానయ్య

- సొంత ఊరికి కావాల్సినవన్నీ ఇస్తున్నాడు
- జన్మభూమి రుణం తీర్చుకుంటూ ధన్యుడవుతున్నాడు



**ప్రజాసేవ పేరుతో రాజకీయాలలోకి వచ్చి డబ్బు సంపాదనే ధ్యేయంగా బ్రతికేవాళ్లు కొందరైతే, నిజమైన సేవకోసమే రాజకీయాలను వేదిక చేసుకుని సొంత డబ్బులను, ఆస్తులను ప్రజల కోసం ఇచ్చేసే అరుదైన వ్యక్తులు మరికొందరుంటారు. అలా అరుదైన వాళ్ళలో ఒక్కడే కావలి మాజీ శాసనసభ్యుడు, వైయస్సార్సీపీ నాయకుడు బీద మస్తాన్‌రావు.**

రాజకీయాలలో విలువలున్న నాయకుడిగా, మంచితనం, మానవత్వం కలిగిన వ్యక్తిగా మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు మస్తాన్‌రావు. గతంలో కూడా తన బియంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టిన సేవా పిపాసి మస్తానయ్య. సెప్టెంబర్ 10వతేదీ, గురువారం, తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సియం జగన్మోహన్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో నాడు-నేడు పథకం క్రింద అభివృద్ధి చెందుతున్న బళ్ళు, ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కోసం కోటి రూపాయల విరాళంతో పాటు, తమ బియంఆర్ చారిటబుల్ ట్రస్ట్ కోసం తన స్వంత గ్రామం ఇస్కపల్లిలో కొనుగోలు చేసిన $8\frac{1}{2}$ ఎకరాల భూమిని కూడా పేదల ఇళ్ల స్థలాల కోసం ఉచితంగా ఇచ్చేశాడు. ఈ స్థలం ఖరీదు కూడా సుమారు కోటి రూపాయలుంటుంది. ఈ స్థలంలో సుమారు 533 ఇళ్ళ ప్లాట్లను రూపొందించి ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందించనుంది.

అంతేకాకుండా ఇస్కపల్లిలో తాను చదువుకున్న జిల్లాపరిషత్ హైస్కూల్ ఆట స్థలం కోసం కూడా 3.10 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చేశాడు. రెండు స్థలాలకూ సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను కూడా ఆయన ముఖ్యమంత్రికి అందజేశాడు. మస్తానయ్యతో ఆయన చిరకాల మిత్రుడు, రాజ్యసభ సభ్యుడే కాకుండా అటు వైయస్సార్సీ పార్టీలోనూ, ఇటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలలోనూ కీలక పాత్ర పోషిస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డి కూడా వున్నాడు.

### గతంలో కూడా అనేక స్థలాలు దానం...

తాను పుట్టిన ఊరికి ఎప్పుడూ ఎదో ఒక మేలు చెయ్యాలన్న తపన మస్తానయ్యది. ఈ క్రమంలోనే గ్రామంలోని యువత కోసం క్రీడామైదానంగా వాడుకోవడానికి 6ఎకరాల స్థలాన్ని ఇచ్చేశాడు. అలాగే టూరిజం అభివృద్ధి కోసం 3ఎకరాలు, మెరైన్ పోలీస్‌స్టేషన్ కోసం 2ఎకరాలు, దాదాపు 2కోట్ల రూపాయలతో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన "ఫిష్ డ్రైయ్యింగ్ ప్లాటుఫారం" కోసం 3ఎకరాలను కూడా తానే ప్రభుత్వానికి ఉచితంగా అందించాడు. ఇస్కపల్లిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తన తండ్రి పేరు మీద 10పడకల ఆసుపత్రిని నిర్మించి ఇచ్చాడు. పేదవాళ్ళు ఉచితంగా పెళ్లిళ్లు చేసుకోవడానికి వీలుగా 2ఎకరాలలో ఒక కల్యాణమండపం నిర్మించి ప్రజలకు అంకితం చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఇలా చెప్పుకుంటూ వెళ్తే... ఆయన చేసిన సత్కార్యాలు, తన జన్మభూమి కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలు చాలానే ఉన్నాయి. మస్తానయ్యకి జన్మనిచ్చిన ఇస్కపల్లి పుణ్యభూమి అయితే, తన జన్మభూమికి వన్నెతెస్తున్న మస్తానయ్య ధన్యజీవి అయ్యాడు.

# పోలీసులు ప్రజలతో స్నేహంగా మెలగాలి

**- జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్**

పోలీసులు ప్రజలతో గౌరవపూర్వకంగా స్నేహపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ పోలీసులకు మార్గదర్శకం చేశారు. ఈనెల 15న నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లోని కల్యాణమండపంలో జిల్లాలోని 5సబ్‌డివిజన్ల పోలీసు అధికారులు, సిబ్బందికి 'పోలీసుల ప్రవర్తనలో రావాల్సిన పరివర్తన' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు, బడుగు బలహీనవర్గాల ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, పోలీసులంటే ప్రజలకున్న భయాన్ని పోగొట్టేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఏఎస్పీ వెంకటరత్నం మాట్లాడుతూ మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను నివారించాలన్నారు. అనంతరం తన సర్వీసులో నిజాయితీగా పనిచేస్తూ అందరి ప్రశంసలందుకుంటున్న హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులురెడ్డిని ఎస్పీ భాస్కర్‌భూషణ్ సన్మానించారు. నగర డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి, ప్రముఖ సైకాలజిస్టులు జె. పద్మాకర్, ఎస్.ధర్మయ్య, డాక్టర్ ఏ.సుబ్రహ్మణ్యం, కె.రవికుమార్, ఎస్.రామకృష్ణ ప్రసాద్, సురేఖ, ఏసిబి డిఎస్పీ శాంతో, డిఎస్పీలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వీక్షణం - మంజీర

# భాషపై దురహంకారమా?

సమైక్య భారతం మనది. అనేక జాతులు, అనేక భాషలు మాట్లాడే ప్రజలున్న భూభాగం. కశ్మీర్‌కి కన్యాకుమారికి ఆహారవిహారాల్లో ఎక్కడా సారూప్యం ఉండదు. గుజరాత్‌లోని గాంధీనగర్‌కి మిజోరామ్‌లోని ఐజ్వాల్‌కు మధ్య పోలికలను అసలు చర్చించలేం. ఎవరికి వారు విభిన్నం. ఎవరి భాష వాళ్లది, ఎవరి యాస వాళ్లది. యాస మారినందుకే ఒకే భాష మాట్లాడే ప్రజలు నివసించే రాష్ట్రాలు రెండుగా చీలిపోయాయి. మరికొన్ని చీలిపోవడానికి సిద్ధమవుతున్నాయి. అలాంటిది ఇది రాజ్యభాష కాబట్టి దేశంలో ప్రతి ఒక్కరూ ఈ భాష నేర్చుకుని తీరాల్సిందే అని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తే... 'మరో దేశంగా విడిపోతామంటారు' తప్ప బలవంతంగా ఇష్టం లేని భాషను నేర్చుకోరు. తమిళనాడులో డీఎమ్‌కే నాయకురాలు కనిమొళి ఇంకా ఆ మాట అనలేదు, కానీ ఆ పరిస్థితే కనుక వస్తే అనడానికి ఏ మాత్రం వెనుకాడరు తమిళులు. ఇప్పుడు తమిళులు చేస్తున్న ఉద్యమం... కొన్ని మీడియా సంస్థలు చిత్రీకరిస్తున్నట్లు హిందీ భాషకు వ్యతిరేకంగా పోరాటం కాదు, హిందీ భాషను తమ మీద రుద్దడానికి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమం అది.

### ఎయిర్‌పోర్టులో తాజా బీజం

ఈ ఉద్యమానికి ఆగస్టులో కొత్త బీజం పడింది. కనిమొళి ఆగస్టు తొమ్మిదవ తేదీన ఢిల్లీ వెళ్లడానికి చెన్నై విమానాశ్రయానికి వెళ్లారు. అక్కడి అధికారి కనిమొళితో హిందీలో మాట్లాడింది. "నాకు హిందీ రాదు. ఇంగ్లీష్‌లో లేదా తమిళ్‌లో మాట్లాడండి" అని అడిగారు కనిమొళి. "భారతీయులకు హిందీ రాకపోవడం ఏమిటి? మీరు ఇండియనే కదా!" అంటూ ఆమెను తేలిక చేస్తూ మాట్లాడింది అధికారి. విమానం ఎక్కి ఢిల్లీ వెళ్లగానే కనిమొళి అదే విషయాన్ని ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ఆమె అంతటితో ఊరుకోలేదు. తిరిగి చెన్నై రాగానే తమిళుల మీద హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాన్ని, హిందీ భాష విషయంలో ఉత్తరాది వారి ఆధిపత్య ధోరణిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఆందోళనను ప్రజల్లోకి సులువుగా తీసుకెళ్లడానికి ఆమె సోషల్ మీడియాతోపాటు టీ షర్టులను కూడా ఉపయోగించుకున్నారు. 'ఐ యామ్ ఇండియన్. ఐ డోన్ట్ స్పీక్ హిందీ' అని ఇంగ్లీష్‌లో ముద్రించిన టీ షర్టు ధరించిన యువకులు ఆందోళనల్లో పాల్గొనడం, ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఉద్యమం త్వరగానే ఊపందుకుంది. ఎవరికి వాళ్లు స్వచ్ఛందంగా ఈ ఉద్యమంలో పాలుపంచుకుంటున్నారు. ఉద్యమం ఊపందుకుంటోందని చెప్పడానికి తిరుపూర్‌లో టీ షర్టు తయారీదారులకు అందుతున్న ఆర్డర్లే నిదర్శనం. ఇప్పటికి పదిహేను వేల టీషర్టులు తయారుచేశారు. తమిళనాడులోని మారుమూల గ్రామాల వాళ్లు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న తమిళులు, విదేశాల్లో ఉన్న తమిళులు ఈ టీ షర్టుల కోసం ఆర్డర్లు ఇస్తున్నారు. వీరిలో కొంతమంది భాషాభిమానులు మరో అడుగు ముందుకేసి 'హిందీ తెరియాతు పోడా' అని ముద్రించుకుంటున్నారు కూడా. ఈ నిరసన నేరుగా మోదీని తాకాలన్నంత కరుకుగా ఉంది తమిళ యువకుల ధోరణి.

### అది హింద్లీష్

తమిళుల విషయంలో 'వారిది భాషాభిమానం కాదు, భాషా దురభిమానం' అనే విమర్శ ఉండేది. హిందీ వాళ్ల విషయానికి వస్తే... 'వాళ్లకు ఉండేది భాషాభిమానం కాదు భాషాదురహంకారం' అనాల్సిందే. ఉత్తరాదిలో జరిగే జాతీయ స్థాయి సదస్సులకు హాజరైన దక్షిణాది వాళ్లకు ఈ విషయం అనుభవంలోకి వచ్చే ఉంటుంది. దక్షిణాది వాళ్లు ఇంగ్లీష్‌ని ఇంగ్లీష్‌గానే మాట్లాడతారు. ఉత్తరాది వాళ్లలో పీజీలు చేసిన వాళ్లు కూడా చాలామంది మంచి ఇంగ్లీష్ మాట్లాడలేరు. ధారాళంగా ఇంగ్లీష్ మాట్లాడే వాళ్లు మాట్లాడేది కూడా ఇంగ్లీష్ కాదు... అది హింద్లీష్. ఇంగ్లీష్ పదాలు మాత్రమే ఉంటాయి, గ్రామర్ ఉండదు. ఇంగ్లీష్ భాషను హిందీ భాషలో కర్త, కర్మ, క్రియకు అనుగుణంగా మలిచేస్తారు. అలా కూడా మాట్లాడలేని వాళ్లు దక్షిణాది వాళ్ల ఇంగ్లీష్‌ను అందుకోలేక... ఆ సంగతిని బయటపడనివ్వకుండా 'మన రాజ్య భాష హిందీని మీరు గౌరవించడం లేదు. హిందీ మాట్లాడకపోవడమేంటి' అని దక్షిణాది వాళ్లను తేలిక చేస్తారు. ఇది ఉత్తరాది వాళ్ల హింద్లీష్ కత. కనిమొళికి ఎదురైన పరాభవం మీద బీజేపీ వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తోంది. కేంద్రప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ అధికారి మీద ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. తమ భాష విషయంలో తమిళులు ఏ మాత్రం రాజీ పడరు. 'మీ భాష పట్ల మీకు ఇంత తిక్క ఉంటే మాకూ ఓ లెక్క ఉంటుంద'ని చూపిస్తారు. తమిళనాడులో పాగా వేయాలని చూస్తోన్న బీజేపీకి పాగా కాదు కదా పాదు వేయడం కూడా కష్టంగా మారుస్తుంది ఈ హిందీ ఉద్యమం. రాబోయే అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీకి రాలిన కమలం రెక్కల లెక్క చూసుకోవాల్సిన పరిస్థితికి హిందీ భాషతోనే వచ్చేటట్లు కనిపిస్తోంది.

### ఇది ఈనాటిది కాదు

తమిళనాడులో 'హిందీ భాష మా మీద రుద్దకండి' అనే ఆందోళన ఇప్పుడు మొదలైంది కాదు. బ్రిటిష్ పాలన కాలంలోనే ఉవ్వెత్తున లేచింది. అప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రాజాజీ. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పాఠశాల స్థాయిలో మూడు భాషల విధానాన్ని ప్రతిపాదించింది. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదన కావడంతో రాజాజీ అంగీకారం తెలిపారు. జస్టిస్ పార్టీ నాయకుడు పెరియార్ రామస్వామి ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. 1937-40 మధ్య కాలంలో ఉద్యమం పతాకస్థాయికి చేరింది. పన్నెండు వందల మంది ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. నటరాజన్, తలముత్తు జైల్లోనే ప్రాణాలు వదిలారు. స్టాలిన్ జగదీశన్ నిరాహార దీక్షలో ఉన్నప్పుడు అన్నాదురై ప్రసంగిస్తూ 'జగదీశ్‌కు కనుక ప్రాణహాని జరిగితే ఈ ఉద్యమాన్ని కొనసాగించడానికి అతడి స్థానంలో నేను దీక్ష వహిస్తాను' అన్నారు. ఉద్యమం రోజురోజుకూ బలోపేతం అవుతోంది తప్ప, చల్లారడం లేదని తెలుసుకున్న రాజాజీ 1939లో రాజీనామా చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం 1940 ఫిబ్రవరిలో హిందీ భాషను తప్పనిసరిగా చదవాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటూ జీవో జారీ చేసింది. అప్పటినుంచి దేశంలో మిగిలిన రాష్ట్రాల పిల్లలు తమ మాతృభాషతోపాటు హిందీ, ఇంగ్లీష్ భాషలను చదువుతున్నారు. హిందీ రాష్ట్రాల వాళ్లు హిందీ, ఇంగ్లీష్‌తోపాటు దేశంలోని ఇతర భాషల్లో తమకు ఆసక్తి ఉన్న భాషను చదువుతున్నారు. తమిళులు మాత్రం తమిళం, ఇంగ్లీష్ రెండు భాషలనే చదువుతున్నారు. గత ఏడాది డీఎమ్‌కే నాయకులు స్టాలిన్ పళనిస్వామికి ఇదే విషయంలో సవాల్ విసిరారు. 'బీజేపీ తమిళ రాష్ట్రంలో పావులు కదుపుతోంది. ఆ పాచికల వలలో పడకుండా రెండు భాషల విధానాన్ని కొనసాగించగలమనే భరోసా ఇవ్వగలరా' అని అడిగారు. ఇప్పుడు కనిమొళి అందుకున్న ఉద్యమం వెనుక ఇంతటి నేపథ్యం ఉంది. ఈ ఉద్యమం ముందు రాబోయే ఎన్నికల లక్ష్యమూ ఉంది.

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com
Please note the change

## కరోనా వైరస్ గాలి ద్వారా వ్యాపిస్తుందా?..

# టీకా ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

### రాజ్యసభలో ప్రశ్నించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



దేశాన్ని అతలాకుతలం చేస్తున్న కరోనా వైరస్‌పై ఈనెల 15వ తేది మంగళవారం రాజ్యసభలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పలు ప్రశ్నలు వేశారు. 'ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొంటున్న ప్రకారం కరోనా వైరస్ గాలి ద్వారా వ్యాపిస్తుందనేది వాస్తవం కాదా?..అలా అయితే ప్రభుత్వం దీనినెలా చూస్తుంది. వాయు మార్గం ద్వారా కోవిడ్-19 వ్యాప్తి చెందకుండా ఎలా చేస్తుంది?..సామాజిక వ్యాప్తి దశలోకి భారత్ ప్రవేశించిందా?..దాని వివరాలు తెలియజేయండి'.. అంటూ ప్రశ్నలు సంధించారు. అందుకు స్పందించిన కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి అశ్వనీ కుమార్ చౌబే మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యసంస్థ చెప్పినట్లుగా కోవిడ్-19 గాలి ద్వారా వ్యాపిస్తుందనేందుకు ఆధారాలున్నాయన్నారు. ప్రధానంగా ప్రజల మధ్య.. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యాధి సంక్రమించిన వ్యక్తులతో దగ్గరగా మాట్లాడుతున్నప్పుడు వారి లాలాజలం శ్వాసకోశ బిందువుల ద్వారా దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు, మాట్లాడుతున్నప్పుడు సంక్రమిస్తుందని వివరించారు. ప్రస్తుతం దేశంలో 77 శాతం కరోనా క్రియాశీలక కేసులకు పది రాష్ట్రాలు మాత్రమే ఎక్కువగా దోహదం చేస్తున్నాయని చెప్పారు. అదేవిధంగా దేశంలో కరోనా వ్యాక్సిన్ కోసం పనిచేస్తున్న కంపెనీలు, ఆయా సంస్థల వివరాలు తెలియజేయాలని, మన దేశంలో కరోనా వ్యాక్సిన్ కోసం పనిచేస్తున్న కంపెనీలు, వాటి వివరాలేమిటి?.. పరిశోధనలు ఎంతవరకు వచ్చాయి?. రష్యా, చైనా ప్రకటించిన వ్యాక్సిన్లను మనప్రభుత్వం అధ్యయనం చేసిందా, ఆ వివరాలేమిటి?.. మనదేశంలో ఎప్పటికి కరోనా వ్యాక్సిన్ రావచ్చని ఆశించవచ్చో తెలియజేయాలని విపిఆర్ కేంద్రమంత్రిని ప్రశ్నించారు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పరీక్ష లైసెన్స్ మంజూరుచేయడం, ముందస్తు పరీక్షలు విశ్లేషణ చేయడం కోసం కోవిడ్-19 వ్యాక్సిన్ తయారీకి అనుమతిని మనదేశంలో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రై.లి.-పూనే, కాడిలా హెల్త్‌కేర్ లిమిటెడ్- అహ్మదాబాద్, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్-హైదరాబాద్, రిలయన్స్ లైఫ్ సైన్సెస్-ముంబై, అరబిందో ఫార్మా లిమిటెడ్-హైదరాబాద్, జెన్నోవా బయోఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్-పూణే కంపెనీలకు అనుమతిని ఇచ్చిందని కేంద్ర మంత్రి తెలియజేశారు. పెద్ద జంతువుల్లో సమాంతర అధ్యయనాలతో పాటు ఫేజ్-1 క్లినికల్ ట్రయల్స్ పూర్తయ్యాయని, ట్రయల్స్ ప్రకారం టీకా అద్భుతమైన పనితీరును, భద్రతను ప్రదర్శించడం జరిగిందని, ఇమ్యునోజెనిసిటీ పరీక్ష పురోగతిలో ఉందని, రెండవ దశ ట్రయల్స్ కొనసాగుతున్నాయని కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. ప్రభుత్వం మరియు పరిశ్రమ కోవిడ్-19 టీకాను త్వరగా సురక్షితంగా సమర్ధవంతంగా అందుబాటులో ఉంచడానికి తమ వంతు ప్రయత్నం చేస్తోందని ఆయన తెలిపారు.

టీకా అందుబాటు విషయంలో అనేక అంశాలు ఇమిడి ఉన్నందున టీకా అందుబాటు తేదీని ఖచ్చితంగా చెప్పలేమన్నారు. రష్యన్ వ్యాక్సిన్ విషయమై ప్రభుత్వంలో చర్చలు కొనసాగుతున్నాయని, అయితే అధికారిక అధ్యయనాలు ప్రారంభించలేదని విపిఆర్‌కు కేంద్ర ఆరోగ్యమంత్రి వివరించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు










Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com